# సింహగిరిపై అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం



**సింహాచలం, మార్చి 27, ప్రభాతవార్త**

సింహాచల పుణ్యక్షేత్రంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిభావం వెల్లివిరిసింది. శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థాన అనుబంధ ఆలయాలైన, కొండపై గంగధార చెంత కొలువై ఉన్న శ్రీ సీతారామస్వామి వారి ఆలయం మరియు రాజగోపురం ఎదురుగా ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా జరిగింది. లోక కళ్యాణార్థం నిర్వహించిన ఈ వేడుకను తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ముందుగా ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకటరావు దంపతులు రామాలయంలో స్వామి అమ్మవారు లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి సమర్పించే పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, ఫలపుష్పాలను, 8వ పేజీలో



# భక్తిశ్రద్ధలతో సీతారాముల కళ్యాణం..

## పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుని దంపతులు



**విశాఖపట్నం -ప్రభాతవార్త**

నర్సీపట్నంలోని వెలమ వీధి రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, వారి కోడలు దివ్యశ్రీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ పండుగ సందర్భంగా ప్రజలందరికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన కుటుంబం తరపున శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. రామాలయంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రామాలయంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న కాంతమ్మ అనే మహిళను స్పీకర్ దంపతులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే రామాలయ కమిటీ సభ్యులను, ఆలయానికి విరాళాలు అందించిన దాతలను కూడా వారు సత్కరించారు. శ్రీరామనవమి వేడుకలతో పాటు నర్సీపట్నంలో వైభవంగా జరగనున్న మరిడమ్మ పండుగ గురించి కూడా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రస్తావించారు. హైదరాబాద్, ముంబై లేదా దుబాయ్, అమెరికా వంటి దేశ విదేశాల్లో ఎక్కడ ఉన్నా.. కుటుంబ సభ్యులు, అల్లుళ్లు, కోడళ్లు అంతా ఈ పండుగకు నర్సీపట్నం రావడం ఇక్కడి ఆనవాయితీ అని ఆయన గుర్తుచేశారు. 31, 1వ తేదీల్లో జరిగే ఈ భారీ జాతరకు బంధువులందరినీ ఫోన్లు చేసి మరీ పిలవాలని, మూడు రోజుల పాటు కుటుంబమంతా ఆనందంగా గడపాలని ఆయన ప్రజలను కోరారు. ఈ పండుగకు నర్సీపట్నంలో సుమారు లక్ష నుంచి రెండు లక్షల మంది వరకు వస్తారని అంచనా వేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా రాత్రివేళ మహిళలు ఇబ్బంది పడకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, క్రమశిక్షణతో అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన సూచించారు.

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**భక్తిశ్రద్ధలతో సీతారామ కళ్యాణంలో పాల్గొన్న భక్తులు -కళ్యాణ అనంతరం నారాయణ సేవ -ఎక్కడ ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ వర్గాలు చర్యలు -భక్తులు ఎండ బారిన పడకుండా చలువ పందిర్లు**

**విశాఖపట్నం, మార్చి 27 ప్రభాతవార్త**

శ్రీరామనవమి సందర్భంగా రామాలయాలు, హనుమాన్ ఆలయాలలో సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ వర్గాలు ఏర్పాట్లు చేశారు. భక్తులు ఎండ బారిన పడకుండా చలువ పందిర్లు వేసి ఎప్పటికప్పుడు మంచినీరు, మజ్జిగ, పానకం అందించారు. ఆలయాల్లో కళ్యాణం సందర్భంగా శోభాయమానంగా అలంకరణ చేశారు. అంబికా బాగ్‌లో శ్రీ సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు పాల్గొన్నారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కళ్యాణ వేదిక వద్దకు సీతా సమేత శ్రీరామస్వామిని తీసుకువచ్చారు. కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. కళ్యాణం చేస్తూ స్వామివారి కళ్యాణము కోసం భక్తులకు వివరించారు. అనంతరం స్వామివారి ప్రసాదాలు తో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రతి కాలనీ , వీధుల్లో గల ఆలయాల్లో స్వామివారి కళ్యాణం 8వ పేజీలో

# 39 వార్డులో క్రికెట్ బాక్స్ స్టేడియం ప్రారంభం



**(ప్రభాతవార్త - విశాఖపట్నం)**

ప్రాజెక్ట్ యువలో భాగంగా వీజీసీబీ క్రికెట్ బాక్స్ స్టేడియాన్ని స్థానిక యువత ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో విజిసిబి తన సిఎస్సార్ ఉపక్రమం ప్రాజెక్ట్ యువ కింద 39వ వార్డు, లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా, మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ సాదిక్, మాజీ ఎస్‌కెఎంఎల్ చైర్మెన్ సింహాచలం, వేదాంత నాయకత్వ బృందం సమక్షంలో ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ అభివృద్ధికి వేదాంతం తన సిఎస్సార్ నిధుల ద్వారా మొత్తం 16 లక్షలు వ్యయం చేసింది. సమాజ మౌలిక సదుపాయాలను బలపరచడం, యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడం పట్ల సంస్థ తన వాగ్దానాన్ని మరోసారి ధృవీకరించిందనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బాట్ పట్టి స్థానిక యువకులతో క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.

# గార్డుపై హత్యయత్నం కేసులో నలుగురి అరెస్టు



**గోపాలపట్నం మార్చి 27 ప్రభాతవార్త**

ప్రైవేటు సెక్యూరిటీ గార్డు పై హత్యాయత్నం చేసిన కేసులో నలుగురు ముద్దాయిలను పోలీసుల అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. దీనిపై గోపాలపట్నం సిఐ ఎల్ సన్యాసినాయుడు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం సింహాచలం ప్రాంతానికి చెందిన పిన్నింటి లక్ష్మణరావు(54) రావుస్ సెక్యూరిటీ సంస్థలో సూపర్వైజర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. విధులలో భాగంగా సంస్థలో వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తుంటాడు. ఈ కోవలో భాగంగా గురువారం రాత్రి పదిన్నర ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై సింహాచలం వైపు వెళుతున్న లక్ష్మణరావును ముగ్గురు వ్యక్తులు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అటకాయించారు. వీరిలో ఇద్దరు మొహాలకు ముసుగులు ధరించి ఉండగా మరో వ్యక్తి టీ షర్టు వేసుకుని ఉన్నాడు. వీరిలో ఒక వ్యక్తి తనతో తెచ్చుకున్న కర్రతో దాడి చేసి లక్ష్మణరావు ఎడంబుజం, దవడ, కంటి భాగం మరియు తలపై తీవ్ర గాయాలు కలిగించాడు. మిగిలిన ఇద్దరూ ముష్టి ఘాతాలు కురిపించారు. అనంతరం నిందితుల అక్కడి నుంచి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మణరావును గోపాలపట్నం లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి స్థానికుల సాయంతో తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం దవడ మీద దాదాపుగా 30 కుట్లు పడ్డ లక్ష్మణరావు పరిస్థితి విషమంగా ఉంది. ఇదిలా ఉండగా వివరాలు తెలుసుకున్న గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కమిషనర్ సంకభ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆరు బృందాలుగా విడిపోయి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులు ఇదే రావుస్ సెక్యూరిటీ సంస్థలో విధులు నిర్వహిస్తున్న కొత్తవలసకు చెందిన నంబారి గోవర్ధన్, సబ్బవరం కు చెందిన గోల గాని గోపి, కడుపుట్ల వేణు, ఉద్దేశపూర్వకంగా దాడి చేసినట్టుగా గుర్తించారు. వీరితో పాటు నేను. సన్యాసినాయుడు అనే వ్యక్తి దాడికి పథకం పన్నినట్టుగా కనిపెట్టారు. వీరిని శుక్రవారం వేపగుంట ప్రాంతంలో తీరుగాడుతుండగా అదుపులోకి తీసుకుని రిమాండ్కు తరలించారు.

### పథకం ప్రకారమే దాడి..

కాగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గోవర్ధన్‌ను లక్ష్మణరావు ప్రశ్నించడంతో దాడికి పథకం పన్నినట్టుగా గుర్తించారు. దీనికి తోడు గోవర్ధన్ సోదరుడైన సన్యాసినాయుడిని సూపర్వైజర్‌గా తొలగించి ఆయన స్థానంలో లక్ష్మణరావుని నియమించడం దాడికి మరింత కారణమయ్యింది. లక్ష్మణరావు పై పగబట్టిన సన్యాసినాయుడు సూచనల మేరకు గోవర్ధన్, గోపి, వేణులు ప్రత్యక్షంగా దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన చోటు చేసుకున్న గంటల వ్యవధిలోనే నిందితులను గుర్తించి దర్యాప్తులో ఉత్తమ పనితీరు కనబరిచిన ఎస్ హెచ్ ఓ సన్యాసినాయుడు, ఎస్సై రామారావు, సిబ్బంది మారయ్య జిలాని అజయ్ కార్తీక్ తదితరులను సిపి అభినందించారు.

# వీసీఎస్సీ ఆధ్వర్యంలో..సైబర్ భద్రతపై అవగాహన సదస్సు



**(ప్రభాతవార్త - విశాఖపట్నం)**

మహిళా మాసోత్సవాల భాగంగా విశాఖపట్నం నగర భద్రతా మండలి (వీసీఎస్సీ) ఆధ్వర్యంలో గురువారం అలయన్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో సైబర్ భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. కిషోర్ దాసరి మార్గదర్శకత్వంలో సీమా సికిరి నేతృత్వంలో జరిగిన ఈ సదస్సుకు నవీన్ జగ్గుమంత్రి సహకరించారు. ఈ సదస్సులో మహిళలపై జరిగే సైబర్ నేరాలకు సంబంధించిన కీలక సమస్యలతో పాటు, ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఉండటానికి తీసుకోవలసిన ముఖ్యమైన జాగ్రత్తలు, అటువంటి సంఘటనలను పరిష్కరించేందుకు అందుబాటులో వున్న ఫిర్యాదుల యంత్రాంగాల గురించి చర్చించారు. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించడంలో తమ సహకారం, తోడ్పాటు అందించిన ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు కి వీసీఎస్సీ బృందం హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**ఎలమంచిలి ,మార్చి 27, ప్రభాతవార్త**

పట్టణంలోని తులసి నగర్ లో సీతారాముల ఆలయం వద్ద శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి దంపతులచే ఈ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ చైర్మన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడు ఆనంద్ కుమార్ పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మధ్యాహ్నం కళ్యాణ అనంతరం భక్తులకు భారీ స్థాయిలో అన్న ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సీతారాముల వారిని పల్లకిలో పాత జాతీయ రహదారి మీదుగా పట్టణములోని ఊరేగించారు ఈ కార్యక్రమంలో వేలాదిగా భక్తులు పాల్గొని పల్లకి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మల్ల కొండబాబు, కర్రి జానకిరామ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# రఘురాం కృష్ణంరాజుపై దాడి అమానుషం : విష్ణుకుమార్‌రాజు

**(ప్రభాతవార్త - విశాఖపట్నం)**



హిందువులు అత్యంత పవిత్రంగా జరుపుకునే శ్రీరామ నవమి రోజున, ఆకివీడులో రామాలయంలో పూజలో పాల్గొనేందుకు వెళ్లిన శాసనసభ ఉప సభాపతి రఘురాం కృష్ణంరాజుపై, ఆయన అనుచరులపై, అలాగే జనసేన నాయకులపై దుండగులు ఆకివీడులో ఆయుధాలతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పండుగ రోజు, ఆలయం సమీపంలో ఈ విధమైన దాడి జరగడం వెనుక కుట్ర కోణం కంచితంగా ఉంటుందని ఈ ఘటనను అత్యంత తీవ్రమైనదిగా పరిగణించి, దాడి వెనుక ఉన్న వారిని గుర్తించి, పూర్తిస్థాయి విచారణ జరిపి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఈ దాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని ఈ దాడిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని- విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ తెలిపారు.

## శ్రీరామ నామస్మరణతో మారుమోగిన కోదండ రామాలయం



మాధవధార, మార్చి 27 ప్రభాతవార్త

శ్రీరామ నవమి సందర్భంగా మాధవధార కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా మాధవధార పుర వీధుల గుండా స్వామివారి పట్టు వస్త్రాలు, ఆభరణాలు, నైవేద్యా లను మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగిం పుగా నిర్వహించి, ఆలయ ఆవరణలో గల కళ్యాణ వేదికపై ఉత్సవ విగ్రహాలను అధిష్టింపజేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణంలో పాల్గొన్న దంపతుల గోత్రనామాలతో సంకల్పం చెప్పి విశ్వక్సే నారాధన, పుణ్యా వచనములతో కార్యక్రమాలను శ్రీకారం చుట్టారు.కంకణ ధారణ నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం మాంగల్య ధారణ,ముత్యాల తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పము మంగళ శాసనము జరిపించారు. మధ్యాహ్నం నుంచి ఆలయ ఆవరణలో అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి పురవీధుల గుండా స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు,మాధవ జన సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణం

విశాఖపట్నం, మార్చి 27 ప్రభాతవార్త



జాతీయ రహదారి సూర్య నగర్ 2లో వేంచేసి ఉన్న శ్రీ యోగ సిద్ధాంజనేయ స్వామి వారి ఆలయ సన్నిధానంలో ఈరోజు శ్రీరామనవమి సందర్భంగా విశ్వ శ్రేయస్సు ను అకాంక్షిస్తూ ఆలయ అర్చకులు శ్రీ పాంచరాత్ర ఆగమ సాంప్రదాయంలో అత్యంత వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని మంగళధ్వని వేదమంత్రము లతో ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పెనుమత్స సుబ్బరాజు యశోద దంపతులు పాల్గొని భక్తులందరి తరఫున ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ సాంస్కృతిక సంగీత సంస్థ మెలోడీ క్రియేటర్స్ వారిచే భక్తి రంజని జరిగింది. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పాల్గొని శ్రీరామదాసు కీర్తనలు అన్నమాచార్య సంకీర్తనలు మధురంగా గానం చేశారు. కార్యక్రమం అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు యశోద దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్, మెలోడీ క్రియేటర్స్ సంగీత సంస్థ సభ్యులు, స్థానికులు, పరిసర ప్రాంతవాసులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారామ కళ్యాణోత్సవాన్ని భక్తి సంగీత కార్యక్రమాన్ని తిలకించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. శ్రీ రామనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.

## క్షత్రియ కళ్యాణ మండపంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు..



విశాఖపట్నం, మార్చి 27 ప్రభాతవార్త

శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం సీతమ్మధారలోని క్షత్రియ కళ్యాణ మండపం లో సిరి వెంకటేశ్వర డెవలోపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.కె రాజు దంపతులు, సుదర్శన రాజు దంపతులు, క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కె.కె రాజు దంపతులు, సుదర్శన రాజు దంపతులు పాల్గొని శ్రీ సీతారాముల వారి కల్యాణమహోత్సవమును అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె రాజు మీడియాతో మాట్లాడుతూ మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్ర మూర్తుల వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించడం ఎంతో విశేషమని పేర్కొన్నారు. ఈకల్యాణ మహోత్సవంలో క్షత్రియ సంక్షేమ సమితి ప్రెసిడెంట్ తిరుపతి రాజు,ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, యన్.శ్రీనివాసరాజు,విసి జి.యస్.యన్.రాజు, యం.ఆర్.కె.రాజు,సి.హెచ్ వెంకటపతిరాజు, క్షత్రియ సంక్షేమ సమితి పెద్దలు, యువకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## ఒక్కరోజే 2,061 ట్రాఫిక్ చలానాలు

### హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వారిపైనే అధిక కేసులు -మద్యం సేవించి డ్రైవింగ్ చేసిన 52 మందికి రూ.4.91 లక్షల జరిమానా

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘనలు అధికమవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు విస్తృత స్థాయిలో అమలు చర్యలు చేపట్టారు. మార్చి 26న నగరంలోని వివిధ కూడళ్లలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 2,061 ఈ-చలానాలు విధించినట్లు ట్రాఫిక్ ఏడిసిపి ప్రవీణ్ కుమార్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై అత్యధికంగా 1,173 కేసులు నమోదు అయ్యాయి. వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించని ఘటనల్లో 215 కేసులు, ఒకే ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించిన వారిపై 72 కేసులు నమోదు చేశారు. అతివేగంగా వాహనాలు నడిపిన వారిపై ఇంటర్‌సెప్టర్ వాహనాల ద్వారా 183 కేసులు, సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ డ్రైవింగ్ చేసిన వారిపై 37 కేసులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై 3 కేసులు, మైనర్ల డ్రైవింగ్‌పై 3 కేసులు నమోదు చేశారు. స్కూల్ ఆటోల్లో పరిమితికి మించి పిల్లలను ఎక్కించిన డ్రైవర్లపై 2 కేసులు నమోదు కాగా, రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలపై 161 కేసులు, టోయింగ్ ద్వారా తరలించిన వాహనాలపై 40 కేసులు నమోదు అయ్యాయి. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 38 కేసులు, ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలపై 482 కేసులు నమోదు చేశారు.మద్యం సేవించి వాహనాలు నడిపిన 52 మందికి గౌరవ మెజిస్ట్రేట్ మొత్తం రూ.4,91,000 జరిమానా విధించారు. అదనంగా 65 వాహనాలను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ ఏడిసిపి తెలిపారు.ఇక నగరంలో బైక్ రేసింగ్, ర్యాష్ డ్రైవింగ్, మోడిఫై చేసిన సైలెన్సర్ల వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ట్రాఫిక్ విభాగం తెలిపింది. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని, హెల్మెట్, సీట్‌బెల్ట్, వేగ నియంత్రణ, మద్యం సేవించి డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు.

## తుంగ్లం ఆలయంలో వైభవంగా సీతారాముల కళ్యాణం



గాజువాక,మార్చి 27,ప్రభాతవార్త

జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ శ్రీ విజయరాఘవ స్వామి ఆలయంలో శుక్రవారం సీతారాము ల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేకువ జామున 5 గంటల నుంచే స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటలకు 20 మంది దంపతుల సమక్షంలో సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. మధ్యాహ్నం నుంచి సుమారు 6వేల మంది భక్తులకు భారీగా అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, వివిధ సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## ఇంధన ధరల తగ్గింపు సాహసోపేతం

### -గాజువాక బీజేపీ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక,మార్చి27,ప్రభాతవార్త



అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగుతున్నా, దేశ ప్రజలపై భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్, గాజువాక నియోజకవర్గ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) కొనియాడారు. శుక్రవారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ భారత్‌లో ధరలు తగ్గించడం విశేషమన్నారు. పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ.13 నుంచి రూ.3కి తగ్గించడంతో పాటు, డీజిల్‌పై ఉన్న రూ.10 సుంకాన్ని పూర్తిగా తొలగించి శ్రీరామనవమి పండుగ పూట దేశ ప్రజలకు ప్రధాని తీపి కబురు అందించారని పేర్కొన్నారు. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గి సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీరాముని ఆదర్శాలు సమాజానికి దిక్సూచి : వెన్నా శ్రీరామమూర్తి



గాజువాక,మార్చి 27,ప్రభాతవార్త

శ్రీరాముని జీవిత చరిత్ర మానవాళికి మార్గదర్శకమని, ఆయన చూపిన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని బీజేపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి పిలుపునిచ్చారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కూర్మన్నపాలెం, ద్వారకాపూరి (ఫేజ్-7)లో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ధర్మం, నీతి, నిజాయితీ వంటి విలువలు నిలదొక్కుకోవాలంటే రామాయణ పరమార్థాన్ని అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. సద్గుణాలతో కూడిన జీవనశైలికి రాముడి జీవితమే దిక్సూచి అని కొనియాడారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు శ్రీనివాసరాజు, ఎం. శివరాం రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## సన్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం..

### పాల్గొన్న విఎంఆర్‌డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

మహారాణిపేట, మార్చి 28 ప్రభాతవార్త



పాండురంగ స్వామి వీధిలో సన్ గ్రీన్ సంస్థ డాక్టర్ కె.శృతి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ వేడుకలో విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ విశిష్ట అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు...అర్చక స్వాముల వేద మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కళ్యాణ వేడుక అత్యంత వైభవంగా సాగింది. సన్ గ్రీన్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ కె. శృతి వి ఏం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ని సాదరంగా ఆహ్వానించి, పూజా కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు. అనంతరం నిర్వాహకులు చైర్మన్ ని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్, శృతి లు మాట్లాడుతూ.. సమాజ హితం కోసం, లోక కళ్యాణం కోసం నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషమైనవని కొనియాడారు. నగర ప్రజలందరికీ ఆయన శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆ రామయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సన్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభయ కోదండ రామాలయంలో వేడుకగా సీతారాముల కళ్యాణం



గాజువాక,మార్చి 27,ప్రభాతవార్త

జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని కణితి కళింగ వీధిలో వెలసిన శ్రీ గణపతి సాయినాథ్ సమేత అభయ కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్నాయి మేళాల నడుమ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు గాజువాక వైకాపా ఇన్చార్జి తిప్పల దేవన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. లోక కళ్యాణార్థం నిర్వహించిన ఈ మహోత్సవం అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైకాపా వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్,దుగ్గపు దానప్పలు, కళింగ యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## భారతీయ జ్ఞానమే దేశానికి ఆధారం

గాజువాక,మార్చి 27,ప్రభాతవార్త



దేశ సుస్థిర వృద్ధికి, స్వయం సమృద్ధికి భారతీయ జ్ఞాన వ్యవస్థ ఎంతో అవసరమని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో 'ఆధునిక సమాజంలో భారతీయ జ్ఞాన వ్యవస్థ పాత్ర' అనే అంశంపై మూడు రోజులుగా జరుగుతున్న ప్రాంతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్య, గణిత, ఖగోళ శాస్త్రాల్లో మన ప్రాచీన జ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆయుర్వేదం, హస్తకళలు 'మేక్ ఇన్ ఇండియా'కు దోహదపడుతున్నాయని వివరించారు. అనంతరం విద్యార్థులు వివిధ అంశాలపై అధ్యయన పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి వై. అనసూయదేవి, ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పోలమాంబ జాతరలో అలరించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

### ఎస్సై వై.కృష్ణ చేతులు మీదగా బహుమతులు ప్రధానం




ఆరిలోవ, మార్చి 27, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక తొమ్మిదో వార్డ్ సంజయ్ గాంధీ కాలనీ గ్రామ ప్రజల కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పోలమాంబ అమ్మవారి జాతర ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కుసుమ హరినాథ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆరిలోవ శాంతిభద్రతల ఎస్సై వై.కృష్ణ చేతుల మీదగా చిన్నారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈనెల 31వ తేదీన జరగనున్న పోలమాంబ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధ్యక్షులు ఒమ్మి రాజు తెలిపారు.

## ఈస్ట్ షిరిడి సాయిబాబా ఆలయం ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవం

విశాఖపట్నం మార్చి 27 ప్రభాతవార్త



ఈస్ట్ షిరిడి ఆలయంలో ఉరుసు ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రీరామనవమి సమయం లో అత్యంత వైభవంగా ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు. హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతీకగా ఈ ఉత్సవంలో బాబాకు చందన లేపనం సమర్పించి, ద్వారకామాయిలో జెండాను ఎగురవేశారు. ఇది సాయి భక్తులకు అత్యంత పవిత్రమైన వేడుక నిర్వహిస్తున్నారు. ఉత్సవంలో భాగంగా చందనం సుగంధ ద్రవ్యాలను పళ్లెంలలో పెట్టి, బాబా వద్దనుండి ప్రత్యేక పూజలు చేసి ద్వారకామాయికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. మేళ తాళాలతో, కోలాటం తీన్మార్‌తో అక్కడినుండి ఊరేగింపుగా నగరవీధుల్లో ఊరేగించి అనంతరం ఈస్ట్ షిరిడి బాబా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ద్వారకామాయిలో బాబాకి ప్రత్యేక పూజలు చేసి ఈ చందనాన్ని బాబా చిత్రపటానికి ద్వారకామాయిలో రాశారు. ఈ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకల్లో వైకాపా రాష్ట్ర నేత వీసం





(నక్కపల్లి, ప్రభాతవార్త)

శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా నక్కపల్లి పట్టణంలో ఉన్న బండారు వీధి, అవ్వార వీధి, పలివెల వీధి తోపాటు పలు దేవాలయాల్లో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇంచార్జ్ వీసం రామకృష్ణ దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలు ఆ దేవాలయాల్లో ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు ఆయనతో పాటు దర్శించుకున్న వారిలో ఎంపీటీసీ సభ్యులు ప్రముఖ బిల్డర్, కొలనాటి బుజ్జి, గొడుగుల బంగార్రాజు, అల్లాడ కొండబాబు ,గిడుతూరి నాగబాబు, మాడెం రాజు తోపాటు పలువురు దర్శించుకున్నారు. బండారు పేటలో అంగరంగ వైభవంగా శ్రీరాముల వారి కళ్యాణం నిర్వాహకులు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను పంపిణీ చేసి శుక్రవారం



సాయంత్రం వీధిలో పల్లకిలో శ్రీరాములవారి ఊరేగింపును కన్నుల వైభవంగా నిర్వహించారు. కారం మిల్లు వీధిలో శ్రీరాములవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. రామకృష్ణతో పాటు కర్రీ వెంకట సత్యనారాయణ (కేవీ) ,మీగడ సత్యనారాయణమూర్తి ,ముద్ద పెద్ద బాబ్జి ,నున్న నరసింహమూర్తి, గుప్తా, ముద్ద నాగేశ్వరరావు, ముద్దా శ్రీను, తదితరులు దర్శించుకున్నారు.

## ఘనంగా శ్రీరాముల వారి కళ్యాణం.!







నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

నక్కపల్లి పట్నంలో పలివెల వీధిలో ఉన్న రామాలయంలో శ్రీరాముల వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు మాడెం రాజు దంపతులు చేతుల మీదుగా స్వామివారి కల్యాణాన్ని పురోహితులు శ్రీపాద పండు నిర్వహించారు. స్వామివారిని పట్టణానికి చెందిన పలువురు గ్రామ పెద్దలు, చేనేత సంఘం నాయకులతో పాటు మేడేటి శంకర్, గొడుగుల బంగార్రాజు తదితరులు దర్శించుకున్నారు.

## సీతారాములను దర్శించుకున్న వైసిపి నాయకులు

పాయకరావుపేట, మార్చి 27, ప్రభాతవార్త



శ్రీరామనవమి పండుగ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మంగవరం వెళ్లే దారిలో ఉన్న సీతా రాముల కోవెలకు వెళ్లిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతారాములను దర్శించుకున్నారు. సీతారాములను దర్శించుకున్న వారిలో పార్టీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా దంపతులు, పాయకరావుపేట పంచాయతీ ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీను తదితరులు ఉన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసులు దాడి..

### ఐదుగురుపై కేసు నమోదు



అడ్డు రోడ్డు, ప్రభాతవార్త

మండలంలోని దేవవరం శివారులో పేకాట ఆడుతున్న పేకాట శిబిరాలపై దాడి నిర్వహించారు. సిఐ జూ రెడ్డి మురళికికి వచ్చిన సమాచారం మేరకు పేకాట శిబిరం పై ఎస్సై మల్లేశ్వర రావు ఇతర సిబ్బంది దాడి చేశారు. ఈ దాడుల్లో వారి వద్ద నుంచి 57310/- (యాభై ఏడు వేల మూడు వందల రూపాయలు) నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు. నక్కపల్లి మండల పరిధిలో ఎటువంటి పేకాటలు గాని, కోడిపందాలు ఇతర ఎటువంటి జూదాలు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

## సింహగిరిపై అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

7వ పేజీ తరువాయి ..

మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి కళ్యాణ వేదికకు చేరుకుని శ్రీ సీతారాములవారికి సమర్పించారు. ఆలయ స్థానా చార్యులు టిపి రాజగోపాల్ వారి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస చార్యులు, సీతారామాచార్యులు,అర్చక స్వాములు, వేద పండితుల ఆగమ శాస్త్రం ప్రకారం వేడుకలు నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనారాధన, పుణ్యాహ వాచనములతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వామివారికి, అమ్మవారికి కంకణ ధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ గావించారు. సుముహూర్తాన జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ ఘట్టాలను అత్యంత కమనీయంగా నిర్వహించారు. స్వామి, అమ్మ వార్ల శిరస్సుపై ముత్యాల తలంబ్రాల వర్షం కురుస్తుండగా, భక్తుల జయజయధ్వానాల మధ్య గంగధార ప్రాంగణం మారుమోగిపోయింది. కళ్యాణం అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేయడంతో పాటు, మహిళా భక్తులకు ప్రత్యేకంగా బ్లౌజ్ పీసులను కానుకగా అందజేశారు. అనంతరం మంత్రపుష్పం, మంగళా శాసనములతో కళ్యాణ క్రతువు సంపూర్ణమైంది.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

7వ పేజీ తరువాయి ..

ఘనంగా నిర్వహించారు. సీతమ్మధారలో గల షిరిడి సాయి ఆలయంలో సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈస్ట్ షిరిడి సాయిబాబా ఆలయంలో సీతారామ కళ్యాణం తో పాటు ఉరుసు ఉత్సవాన్ని కూడా నిర్వహించారు ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీతమ్మధార నాట్ ఎక్స్టెన్షన్‌లో క్షత్రియ కళ్యాణ మండపంలో కేకే రాజు సీతారామ కళ్యాణం నిర్వహించి నారాయణ సేవను చేశారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

మధురవాడ,ప్రభాతవార్త



నగరపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ చిక్కాల విజయబాబు పాల్గొని గ్రామస్తులు ఏర్పాటుచేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంపాలెం గ్రామ పెద్దలు, యువత సీతారాముల కళ్యాణం అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేసి సీతారాముల విగ్రహాలను గ్రామం మొత్తం ఊరేగించారు.

## శ్రీరామనవమి పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు

మధురవాడ,ప్రభాతవార్త



విశాఖపట్నం శిల్పారామంలో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా నిర్వ హించు సాంస్కృతిక కార్యక్రమాలో భాగంగా జోష్ డాన్స్ అకాడమీ చిన్నారులచే నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్యములు సందర్శకులను ఆకట్టుకున్నాయని రమేష్ రెడ్డి, పరిపాలన అధికారి, శిల్పారామం, విశాఖపట్నం తెలిపారు.


వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, ZAIBUNNISA BEGUM (new name) Wife of SHAIK MOULA, previously called AZIZUN (old name), R/O No. 24-63-6, Ambusarang Street, Kota Veedhi, Visakhapatnam, 530001 Now changed my name from AZIZUN to ZAIBUNNISA BEGUM, Hence forth I will be called as ZAIBUNNISA BEGUM for all purpose.
(Ro.No.48782)

★ I, LAKSHMI BALLA W/O KASINA TRINADHA RAO previously called LAKSHMI KASINA R/O 27-198/4/5, CHANDRASEKHARA NILAYAM, FNO. 501, APPANNAPALEM, VISAKHAPATNAM, now changed my name from LAKSHMI KASINA to LAKSHMI BALLA. Henceforth I will be called as LAKSHMI BALLA for all purposes.
(Ro.No.48943)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## ఎన్. నర్సాపురంలో ఘనంగా శ్రీరాములవారి వారి ఊరేగింపు

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని ఎన్.నరసాపురం గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీరాములు వారి కల్యాణం నిర్వహించారు ముందుగా ఆ గ్రామ సర్పంచ్ పళ్ళ చిన్నబ్బాయి, భార్య నూకరత్నంలు కుటుంబంతో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలతో పాటు సారేని సమర్పించారు. అనంతరం స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## అరట్లకోటలో ఘనంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలు

పాయకరావుపేట రూరల్, మార్చి 27, ప్రభాతవార్త



మండలంలోని అరట్లకోటలో శుక్రవారం గ్లోబల్ స్టార్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బర్త్ డే కేక్ కట్ చేసి తమ అభిమాన కథానాయకుడు రామ్ చరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. పెద్ద ఎత్తున బానా సంచా కాల్చి సందడి చేశారు. గ్రామస్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు 200 మంది మహిళలకు జాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు దొమ్మేటి చరణ్, చిట్టిపళ్ళ జై దీప్, గర్లంక రాజేష్, వేముల శ్రీకాంత్, గొల్లపల్లి రాజా, గట్టెం మధు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకల్లో కొప్పిశెట్టి

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



మండలంలోని అత్యంత వైభవంగా అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు మండలంలోని వేంపాడు తో ఉపమాక, రాజయ్యపేట, డిఎల్ పురం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా నక్కపల్లిలో టిడిపి పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ స్వామివారి దర్శించుకున్నారు. ఆయనతోపాటు దర్శించుకున్న వారిలో పట్టణ దేశం అధ్యక్షులు అడ్డూరి లోవరాజు, ఆర్యవైశ్య పెద్దలు నున్న గుప్త మోటార్స్ వాహన డ్రైవర్ల ఓనర్ల సంఘం అధ్యక్షులు సత్య ,టిడిపి మండల నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ (కేవీ) ,టిడిపి నాయకులు దేవరపు లోవరాజు, అడ్డూరి పెద్ద స్కూల్ చైర్మన్ మాజీ సర్పంచ్ మీసాల బాబులు, జనసేన నాయకులు బద్రి తదితరులు ఉన్నారు.

## పేకాట ఆడుతున్న ఆరుగురుపై కేసు నమోదు

పాయకరావుపేట, మార్చి 27, ప్రభాతవార్త



పాయకరావుపేట మండలం మసాహెబ్ పేట గ్రామ శివారుణ సుమారు ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పాయకరావుపేట ఎస్‌హెచ్ ఓ,జి.అప్పన్నకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై పురుషోత్తం పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి అన్ని వైపుల నుండి వెళ్లి పేకాట ఆడుతున్న వారి వద్ద నుండి రూ.12,230 పేకాడుతున్న 52 పేక ముక్కలు సహా నాలుగు సెల్ ఫోన్లు పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసి ఇన్వెస్టిగేషన్ చేయడం జరుగుతుంది. కోడిపందాలు, రబ్బరు గుండాట, పేకాట లాంటి ఆటలు ఆడినట్లు సమాచారం ఉంటే మాకు సమాచారం ఇచ్చినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది.

## కన్నుల పండుగ శ్రీరాముని కళ్యాణం.. తరలివచ్చిన భక్తులు

(నక్కపల్లి, ప్రభాతవార్త)





శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మండలంలోని వేంపాడు గ్రామంలో కనుల వైభంగా శ్రీరాములు వారి కల్యాణాన్ని వేలాది మంది భక్తులు ఘనంగా శుక్రవారం నిర్వహించారు గ్రామ పెద్దలు అయినంపూడి బంగారు రాజు దంపతులు కల్యాణంలో కూర్చున్నారు. అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. సాయంకాలం చిన్న పలకలో ఊరేగించారు. శ్రీరాములు వారి అలంకరణ చూసిన భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కళ్యాణం కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కనుల పండువగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

ఆనందపురం, మార్చి27, ప్రభాతవార్త



ఆనందపురం రామాలయంలో శ్రీ సీతారాముల 19వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఆలయ ధర్మకర్త యేచూరి శైలజా లక్ష్మీ నారాయణ శర్మ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం పుణ్యకాలంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని ప్రారంభించి, విశిష్ట వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి నిర్వహించారు. ఆధ్యాత్మిక పరవశం నింపేలా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మూడు రోజులు పాటు ఉత్సవాలు జరగనున్నాయని ఆలయ ధర్మకర్త యేచూరి శైలజా లక్ష్మీనారాయణ శర్మ దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొట్యాడ సత్యమూర్తి, కొట్యాడ లక్ష్మణమూర్తి, సినగం చిన్న రామారావు, చందక త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలపై లేజర్ నిఘా

**విశాఖ ట్రాఫిక్ పోలీసులకు రెండు స్పీడ్ లేజర్ గన్స్ -సీఎస్ఆర్ కింద జీవీఎంసీ నుంచి రూ.18 లక్షల పరికరాల అందజేత -మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన సీపీ శంఖబ్రత బాగ్చి, జీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)




నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమా దాల నివారణపై మరింత కట్టుదిట్టమైన చర్యలకు విశాఖ ట్రాఫిక్ పోలీసులు సిద్ధమవు తున్నారు. వాహనాల వేగ నియంత్రణ, నిబంధనల అమలులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు రెండు స్పీడ్ లేజర్ గన్స్‌ను ట్రాఫిక్ శాఖకు అందజేశారు. ఈ పరికరాలను సుమారు రూ.18 లక్షల వ్యయంతో సీఎస్ఆర్ నిధుల కింద జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ద్వారా అందించినట్లు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం పోలీస్ సమావేశ మంత్రంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీపీ బాగ్చి , జీవిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ లు కలిసి వివరాలను తెలియజేశారు. నగర ట్రాఫిక్ నిర్వహణలో ఇటీవలి కాలంలో పలు మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్లు, కూల్ రేడియం జాకెట్లు అందజేసి విధుల నిర్వహణలో సౌకర్యం కల్పించారు. పెరుగుతున్న వాహనాల రాకపోకల నేపథ్యంలో పగలు, రాత్రి వేళల్లో నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ అమలు చర్యలు మరింత కట్టుదిట్టం చేశారు.కొంత మంది వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు పెరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అతివేగం, హెల్మెట్ లేకుండా ప్రయాణం, ముగ్గురు ప్రయాణించడం, రాంగ్‌రూట్‌లో వాహనం నడపడం వంటి ఉల్లంఘనలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన స్పీడ్ లేజర్ గన్స్ ద్వారా 100 మీటర్ల దూరం నుంచే వాహనాల వేగాన్ని గుర్తించి, నిబంధనల ఉల్లంఘనలను నమోదు చేయగలుగుతారు. ఈ పరికరాల సహాయంతో అతివేగం, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడపడం, వెనుక కూర్చున్నవారు హెల్మెట్ ధరించకపోవడం, ఒకే ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించడం, వ్యతిరేక దిశలో వాహనం నడపడం వంటి ఉల్లంఘనలను గుర్తించి చలానాలు విధించనున్నారు. నమోదైన వివరాలు నేరుగా డిజిటల్ విధానంలో భద్రపరచబడతాయి. ఇంకా మరో స్పీడ్ లేజర్ గన్‌ను సౌత్ ఏషియన్ ఎల్పిజి సీఎస్ఆర్ కింద మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. దాని విలువ కూడా సుమారు రూ.18 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో అది కూడా ట్రాఫిక్ శాఖకు చేరనుంది.మూడు పరికరాలనూ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ సాంకేతిక వ్యవస్థతో అనుసంధానం చేసి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రియల్‌టైమ్‌లో కాంటాక్ట్‌లెస్ చలానాలు విధించే విధానం అమలు చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దీతో నగర ట్రాఫిక్ అమలు మరింత సమర్థవంతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## కొమ్మాది జంక్షన్‌లో ట్రాఫిక్ కంచుకోట

**రైతు బజార్, ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌తో సర్వీస్ రోడ్డే నిలిచిపోయే స్థితి -చలానాల కంటే నియంత్రణపై దృష్టి పెట్టాలంటూ వాహనదారుల విజ్ఞప్తి -సీపీ శంఖబ్రత బాగ్చి టాపిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిందే**

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



విశాఖ నగర ఉత్తర భాగంలో వేగంగా విస్తరిస్తున్న నివాస, వాణిజ్య ప్రాంతాల ప్రభావం కొమ్మాది జంక్షన్‌పై తీవ్రంగా పడుతోంది. ప్రధాన రహదారిపై ఇప్పటికే పెరిగిన వాహన రద్దీకి తోడు, జంక్షన్‌కు ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో కొమ్మాది--మధురవాడ--హనుమంతవాక మార్గంలో వాహనాలు వరుసగా నిలిచిపోవడం సాధారణంగా మారింది. సిగ్నల్ మారిన తర్వాత కూడా రెండు నుంచి మూడు సైకిళ్లు వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. కొమ్మాది జంక్షన్ సమీపంలోని రైతుబజార్ కు వచ్చే కొనుగోలుదారులు, రైతులు, వ్యాపారస్తుల రద్దీ సర్వీస్ రోడ్డుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తెల్లవారుజాము నుంచే కూరగాయల వాహనాలు, సరుకు దిగుమతులు, కొనుగోలు కోసం వచ్చే ప్రజలు ఒకేసారి చేరడంతో రహదారి కిటకిటలాడుతోంది. రైతు బజార్‌కు వచ్చే ఆటోలు, ద్విచక్రవాహనాలు, చిన్న వాణిజ్య వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఆగిపోవడంతో జంక్షన్ వరకు వాహనాల కదలిక మందగిస్తోంది. ఫుట్‌పాత్‌లు చిరు వ్యాపారాలతో పూర్తిగా ఆక్రమించబడటంతో పాదచారులు రోడ్లపైనే నడవాల్సి వస్తోంది. దీంతో ఒకవైపు వాహనాలు, మరోవైపు పాదచారుల సంచారం కలిసి సర్వీస్ రోడ్డును మరింత ఇరుకుగా మారుస్తున్నాయి. ముఖ్యంగా స్కూల్ సమయాల్లో విద్యార్థులతో వచ్చే తల్లిదండ్రులు, ఆటోలు, స్కూల్ బస్సులు ఒకేసారి చేరడంతో పరిస్థితి మరింత క్లిష్టమవుతోంది.ఇక ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్, సర్వీస్ రోడ్డులో భారీ వాహనాల ప్రవేశం, కమర్షియల్ వాహనాల నిలిపివేతతో వాహనాలు నిలిచిపోయే పరిస్థితి నిరంతరం కనిపిస్తోంది. కొంతసేపు నిలిపిన లారీలు, సరుకు వాహనాలు రహదారిలో సగభాగాన్ని ఆక్రమించడంతో రెండు దిశల్లో వాహనాల కదలిక దాదాపు నిలిచిపోతోంది. రాత్రివేళల్లోనూ భారీ వాహనాలు ఇదే మార్గాన్ని వినియోగించడం స్థానికులకు మరింత ఇబ్బందిగా మారిందని వాహనదారులు చెబుతున్నారు.వాహనదారుల అభిప్రాయం ప్రకారం ట్రాఫిక్ రద్దీని నియంత్రించాల్సిన సమయంలో కొంతమంది ట్రాఫిక్ సిబ్బంది సెల్‌ఫోన్లతో ఫోటోలు తీసి ఉల్లంఘనలను నమోదు చేయడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. రూల్స్‌కు విరుద్ధంగా వాహనాలు నడిపేవారిపై చలానాలు విధించడం సమంజసమేనని, అయితే అదే సమయంలో ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతను పక్కనబెట్టి టార్గెట్లకే ప్రాధాన్యం ఇస్తే సమస్య మరింత పెరుగుతుందని పేర్కొంటున్నారు. కొమ్మాది మాత్రమే కాకుండా మధురవాడ, కార్ షెడ్ జంక్షన్‌లలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు ఈ మార్గాల్లో ప్రయాణ సమయం గణనీయంగా పెరుగు తోందని అంటున్నారు. కొత్త అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలు, చిన్న వ్యాపార కేంద్రాలు పెరగడం వల్ల వాహనాల సంఖ్య రోడ్డు సామర్థ్యాన్ని మించి పెరిగిందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పీఎంపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్మాది, మధురవాడ, కార్ షెడ్ జంక్షన్‌లలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. సర్వీస్ రోడ్లలో అక్రమ పార్కింగ్ తొలగింపు, ఫుట్‌పాత్ ఆక్రమణల నివారణ, రైతు బజార్‌కు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు, పీక్ అవర్స్‌లో అదనపు ట్రాఫిక్ సిబ్బంది నియామకం చేపడితే కొంత ఉపశమనం లభిస్తుందని భావిస్తున్నారు.

## కన్నులపండువగా 'రాములోరి' కల్యాణం

గాజువాక,మార్చి 27,ప్రభాతవార్త



జీవీఎంసీ 72వ వార్డు పాత కర్నవానిపాలెంలోని పురాతన రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం శుక్రవారం కన్నులపండువగా, రమణీయంగా జరిగింది. తొలుత ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అర్చకులు రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కల్యాణ తంతు చేపట్టారు. బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జ్యోతి దంపతులు సీతమ్మ వారికి తాళిబొట్టును అందజేశారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, శ్రీరామ నామ స్మరణల మధ్య జరిగిన ఈ కల్యాణ వేడుక భక్తులకు నేత్రపర్వాన్ని కలిగించింది. ఈ వేడుకలో గాజువాక సీఐ పార్థసారథి, మాజీ కార్పొరేటర్లు ఏజె స్టాలిన్, గంధం శ్రీనివాస్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 5 వేల మందికి అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా కేవీఎన్ఆర్ మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా కల్యాణ పీఠంపై కూర్చుని స్వామివారి సేవలో పాల్గొనడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరసపల్లి నూకరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు అప్పారావు, కరణం కనకారావు, నాయకులు కృష్ణంరాజు, రంగనాయకులు, పప్పు రాజారావు పాల్గొన్నారు.

## సీతారాముల సాక్షిగా బడిబాట

సింహాచలం ప్రభాతవార్త



98 వార్డ్ విజినిగిరిపాలెం ప్రధానోపాధ్యాయిని విద్యావతి బడి బాటను వినూత్నం గా నిర్వహించారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా గ్రామంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. గ్రామంలో అందరూ ఒక చోట చేరే సందర్భంగా ఆ వేదిక పై నుండి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను చేర్పమంటూ తల్లితండ్రులను కోరారు. విద్య కోసం ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుడి బడి గ్రామానికి చాలా ముఖ్యమైన వని విలువలతో కూడిన విద్యను అందిస్తూ , ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తూ అనేక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్న మా పాఠశాలలో మీ పిల్లలను చేర్చి ఒక్క సంవత్సరం చూడండి మాకు ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ ఆమె తల్లితండ్రులను అర్థించారు. కార్పొరేటర్ పిసిని వరాహనరసింహం బడిబాట పంప్లేట్ లను తల్లితండ్రులకు ఇచ్చి ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించమని కోరారు. రామాలయం అర్చకులు మూర్తి కూడా విద్యార్థులు విలువలు నేర్చుకోవాలంటే ప్రభుత్వ పాఠశాల ద్వారానే సాధ్యం అని బట్టి పట్టించే ప్రైవేటు పాఠశాలల్లోచేర్చడం వల్ల జ్ఞానం రాదు అని హితవు పలికారు. పాఠశాల స్థాయి లో ఉచితం గా వస్తున్న విద్యను అందిపుచ్చుకొని ఉన్నత విద్య కోసం డబ్బులు ఖర్చు చేసుకుంటే ఆర్థికం గా బాగుంటుంది అని ఆయన సూచించారు.

## శిష్టకరణల సమస్యలు పరిష్కరించాలి

**మంత్రి మండిపల్లి ప్రసాద్‌రెడ్డికి వినతి-ఓబీసీలో చేర్చాలని పల్లా శ్రీనివాసరావుకు మనవి**

గాజువాక,మార్చి 27,ప్రభాతవార్త



రాష్ట్రంలోని శిష్టకరణ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ రాష్ట్ర శిష్టకరణ సంక్షేమ సేవా సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి ప్రసాద్‌రెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. సత్వరమే శిష్టకరణ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి, ఈ సామాజిక వర్గానికి చెందిన యువతీ యువకులకు ఉపాధి రుణసదుపాయం కల్పించి ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు. గాజువాక నియోజకవర్గం 71వ వార్డు క్లస్టర్ ఇంచార్జ్ ప్రతాపరావు శ్రీనివాసరావు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు హక్కు మహంతి నాగేశ్వరరావు రాజా ఆధ్వర్యంలో ఈ వినతిని అందించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధలను కలిసి సామాజిక వర్గ ఇబ్బందులను వివరించారు. రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన శిష్టకరణ కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేలా ప్రభు త్వం చొరవ చూపాలని కోరారు. తమ విన్నపంపై నాయకులు సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు.

## చిన్నారి ప్రాణాన్ని కాపాడిన అపోలో వైద్య బృందం

ఆరిలోవ, మార్చి 27, ప్రభాతవార్త



అపోలో హాస్పిటల్స్‌లో 10 సంవత్సరాల బాలుడిని తీవ్ర అనారోగ్య స్థితి నుండి వైద్య బృందం విజయవంతంగా కాపాడింది. ఈ సందర్భంగా పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ లీడ్ కన్సల్టెంట్ డా. చిట్టూరి విశ్వతేజ మాట్లాడుతూ బాలుడు తీవ్రమైన ఇన్ఫెక్షన్, శ్వాస సమస్యలు, ఎంఒడిఎస్‌తో ఆసుపత్రికి చేరాడని, వెంటనే వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ప్రారంభించారు. పరిస్థితి విషమించడంతో ఏ ఆర్ డి ఎస్ ఏర్పడగా, ఈ సి ఎం ఓ అనే అత్యాధునిక ప్రాణరక్షక చికిత్సను అందించారు. ఈ సి ఎం ఓ పై 12 రోజులు ఉండగా బాలుడు క్రమంగా కోలుకున్నాడు. తదుపరి చికిత్సతో పూర్తిగా కోలుకుని బాలుడు డిశ్చార్జ్ అయ్యాడు. అపోలో హాస్పిటల్ సి ఓ ఓ డా. కృష్ణ ప్రసాద్, డా. విశ్వతేజ తో పాటు బృందం సభ్యులు డా. సన్యాసినాయుడు, డా. పద్మ, డా. మాళవిక, డా. కిషన్, డా. మౌనిక, డా. ఫజాలా, డా. వైభవ్‌లను అభినందించారు.

## విశాఖ సిటీ పోలీస్ టీంకు ఏడు వికెట్ల విజయం

**- ఇన్‌స్టిట్యూషనల్ లీగ్‌లో బార్క్‌పై ఆధిపత్యం**

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



విశాఖపట్నం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇన్‌స్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖపట్నం సిటీ పోలీస్ క్రికెట్ టీం జట్టు ఘన విజయం సాధించింది. గాజువాకలోని జింక్ గ్రౌండ్ లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భాభా ఆటోమేటిక్ రిసెప్ సెంటర్ (బార్క్) జట్టును ఏడు వికెట్ల తేడాతో ఓడించింది.ముందుగా బ్యాటింగ్ చేసిన బార్క్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 108 పరుగులు చేసింది. జట్టులో ఎన్. వెంకట దుర్గా ప్రసాద్ 38 బంతుల్లో 54 పరుగులు చేసి ప్రధాన స్కోరర్‌గా నిలిచారు. ఆయన ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి.అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సిటీ పోలీస్ జట్టు 12.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. టి. రాజు 49 పరుగులతో జట్టును విజయతీరాలకు చేర్చారు. ఆయన ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి.బౌలింగ్‌లో సిటీ పోలీస్ జట్టుకు వి. త్రినాథ్ నాలుగు వికెట్లు పడగొట్టి మెరుపు ప్రదర్శన చేశారు. ఎల్. శ్రీను మూడు వికెట్లు తీసి విజయానికి తోడ్పడ్డారు. మొత్తంగా అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించిన సిటీ పోలీస్ జట్టు టోర్నమెంట్‌లో మరో విజయాన్ని నమోదు చేసింది.

## భర్త అదృశ్యం.. భార్య ఫిర్యాదు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త ఆచూకీ తెలియక భార్య ,కుటుంబ సభ్యులు ఆందోళనకు గురైన ఘటన మధురవాడ పరిధిలో చోటుచేసుకుంది. మధురవాడ, శ్రీనివాసనగర్‌కు చెందిన గృహిణి పైల సీత తన భర్త కనిపించడం లేదంటూ పీ.ఎం.పాలెంపోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీనివాసనగర్‌లో నివసించే పైల సీత భర్త పైల రఘు (38) ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి ఇంటి వద్ద నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. అనంతరం ఈ నెల 17, 20 తేదీల్లో ఇతరుల మొబైల్ ఫోన్ల ద్వారా కుటుంబ సభ్యులకు కాల్ చేసి త్వరలో వస్తానని తెలిపినా తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.గతంలో కూడా జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఇదే తరహాలో ఇంటి నుంచి వెళ్లిపోవడం జరిగిందని, కొంతకాలం తర్వాత తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఈసారి చాలారోజులు గడిచినా ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. భర్త ఇంటికి రాకపోవడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ఆయనను గుర్తించి అప్పగించవల సిందిగా సీత పోలీసులను కోరారు. ఈ మేరకు పీ.ఎం.పాలెం సిఐ బాలకృష్ణ నేతృత్వంలో సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## వైభవంగా రాములోరి కళ్యాణం

ఆరిలోవ, మార్చి 27, ప్రభాతవార్త



శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక 11వ వార్డు గాంధీ నగర్ లో అంబేద్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షులు, తెలుగుదేశం నాయకులు కాకి గంగరాజు ఆధ్వర్యంలో రాములోరి కళ్యాణం వేద పండితుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కళ్యాణంలో 300 మంది దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం నాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. సుమారు 3వేల మందికి పైగా భక్తులు అన్నదానంలో పాల్గొని రాముల వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు,12వ వార్డు ఇన్చార్జ్ ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం తో పాటు గ్రామ గుడి అర్చకులు బలరామకృష్ణశాస్త్రి, కాసి గంగరాజు, ముది అప్పారావు, కుందూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు

## పద్మనాభం మండలంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

పద్మనాభం,మార్చి 27, ప్రభాతవార్త



మండలంలో వివిధ గ్రామాలలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను ప్రజలు వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఉన్న రామా లయంలో ఈ వ ం హో త్స వా ల న ు ఉత్సాహభరితం గా జర ు వ ు క ు న్నార ు . ఈ సందర్భంగా రామాల యాను పూలమాలల, తాటాకుల పందిర్లతో ఆకర్షణీయంగా అలంకరించారు. రామాలయాల లో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సీతారాములు కళ్యాణంను అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాలుతో నిర్వహించారు.కోరాడలో మండల వైసీపీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు దంపతులు చహచర భక్తులతో కళ్యాణం నిర్వహించారు.దీంతో రామనామంతో గ్రామాలు మారుమోగాయి. పాడిపంటలు బాగా పండాలని ప్రజలు సీతారాములను వేడుకొన్నారు. అయినాడ, రెడ్డిపల్లి,పొట్నూరు, నర్సాపురం, మద్ది, వి కె పాలెం, కృష్ణాపురం, గ్రామాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## పద్మనాభం మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలు

పద్మనాభం, మార్చి 27,ప్రభాతవార్త



మండలంలో కోరాడ, అయినాడ, బాపిరాజు తాళ్లవలస గ్రామాలలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలు చెందుతున్నారు. పోలీసుల నిర్లక్ష్యంతో దొంగలు పద్మనాభం మండలంలో రెచ్చిపోతున్నారని ఇరుపార్టీల పెద్దలు వాపోతున్నారు. అయితే కోరాడ గ్రామంలో శుక్రవారం వేకువ జామున గెద్దపేట రోడ్డులో గ్రామం అంచున ఉన్న విద్యుత్ ట్రాన్సుఫార్మరును దొంగలు దొంగలిస్తుండాగా రైతులు చూడడంతో దొంగలు పరారయ్యారని,వారి వీడియోలను తీసి పోలీసులకు అప్పగించారని గ్రామ సర్పంచ్ లక్ష్మణరావు చెప్పారు. అలాగే ఇటీవల తమకు చెందిన 5 హెచ్ పి వ్యవసాయ విద్యుత్ మోటర్లు, బసవన అప్పలనాయుడు మోటరును దొంగలించినట్లు ఆయన తెలిపారు. అలాగే బి తాళ్లవలస గ్రామంలో తమకు చెందిన 45 కోళ్లను దొంగలించగా, కొండపల్లి కిషోర్,పాండ్రంగి సన్యాసిరావులకి చెందిన పాన్ షాపులు తాళాలు పగలుగొట్టి సామాన్లును,డబ్బులను దొంగలించారని మండల టీడీపీ అధ్యక్షులు కోరాడ రమణ తెలిపారు. అయినాడలో కొల్లు సురేష్, కాసా నాగరాజుల ద్విచక్రవాలను దొంగలించినట్లు గ్రామ సర్పంచ్ మామిడి శివరామకృష్ణ చెప్పారు.బి తాళ్లవలసలో జరిగిన దొంగతనాలపై పోలీసులకు చెప్పినా స్పందించలేదని రమణ ఆవేదన వ్యక్తం చేశారు.

## గుడిలోవలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ఆనందపురం, మార్చి 27, ప్రభాతవార్త:



ఆనందపురం మండలంలోని గుడిలోవలో ఉన్న విజ్ఞాన విహార పాఠశాల ఆవరణలో శుక్రవారం శ్రీరామ నవమి ఉత్సవం సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని కనుల పండువగా నిర్వ హించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్తానం బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత్రి చిట్టెళ్ళ నిర్మలాదేవి మాట్లాడుతూ ఆదర్శవంతమైన కుటుంబ జీవనానికి, పితృవాక్ పరిపాలనకు, సత్యవంతమైన గుణాలు కలిగిన రాముడు ఆదర్శ నీయుడని చెప్పారు. సీతారాముల జంట సకల భారత జీవనానికి స్వచ్ఛమైన మనసులు కలిగిన దాంపత్య జంటని వివరించారు. మండలంలోని 19 గ్రామాలనుంచి 46 దాంపత్య జంటలు సామూహిక కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా భారతి అఖిల భారత ఉపాధ్యక్షులు, విజ్ఞాన విహార డైరెక్టర్ దూసి రామకృష్ణ రావు, కమిటి సభ్యులు ఎ. రవి ప్రసాద్, సతీష్ రామ చౌదరి, సింగనబంద సర్పంచ్ గాడు వెంకట నారాయణ దంపతులు, ఆర్ ఎస్ ఎస్ ఆనందపురం ఖండ కార్యవాహ బాలి రవి దంపతులు, విజ్ఞాన విహార పూర్వ విద్యార్థి కేశవ ప్రసాద్ దంపతులు,ఆవనాపు దేముడు, కరోతి సత్యనారాయణ దంపతులు, మొకర సన్నిబాబు దంపతులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం

కసింకోట, మార్చి 27, ప్రభాతవార్త



శ్రీరామనవమి సందర్భంగా కసింకోటలోని రామాలయాల్లో సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా జరిపారు. రామాలయాల్లో శుక్రవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కసింకోటలోని పలు రాములయాలను రాష్ట్ర అర్బన్ ఫైనాన్సు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ, జిల్లా బిజెపి అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రామకృష్ణ, అనకాపల్లి నూకంబిక దేవస్థానం చైర్మన్ పీల నాగ శ్రీను, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ, కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు, ఎస్సైలు లక్ష్మణరావు మనోజ్ కుమార్ లు రామాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపి, పిఎసిఎస్ అధ్యక్షుడు సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల సతీష్, దాసరి బాబు, తాకాసి కృష్ణ, సిప్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం...

### సీతారాములు వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు..

ఎలమంచిలి, మార్చి, 27, ప్రభాతవార్త



శ్రీరామ నవమిని పురస్కరించుకొని శుక్రవారం నాడు ప్రతి పల్లెలోనూ పట్టణంలోనూ సీతారాముల వారి దేవాలయాల్లో రంగ రంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం ప్రజల భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారాముల వారి కళ్యాణం అందరిదీ కావడంతో గ్రామ స్తులంతా ఐక్యతగా రామాలయంలోభక్తి శ్రద్ధలతో కల్యాణాలు నిర్వహించారు.



జంపపాలెం గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మధ్యాహ్నం ప్రతి దేవాలయం వద్ద భోజనం ప్రసాదం కుల బేధాలు లేకుండా స్వీకరించారు. ఎలమంచిలి పట్టణంలో కాకి వాని వీధిలో గల రామాలయం, కొత్తపేట రామాలయం, పాతవీధి రామాలయం, తులసి నగర్ రామాలయం, కొత్తపాలెం రామాలయం రామ్ నగర్ రామాలయాల్లో మండలంలో ప్రతి పల్లెలోనూ కనుల విందుగా సీతారాముల వారి కళ్యాణాన్ని ప్రజల వీక్షించారు.

## కనుల వైకుంఠంగా సీతారాముల వారి కళ్యాణం అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి మార్చి 27,ప్రభాతవార్త



మెయిన్ రోడ్ చిన్న బజార్ వద్ద కొలువైన శ్రీ సీతారామ ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయ వద్ద సీతారామ కళ్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుండి తీసుకువచ్చిన స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేసి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రామ్కి, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర పలువురు పట్టు వస్త్రాలు కర్పూరం దండలు పూలదండలు సమర్పించారు. ఈ కళ్యాణంలో కుప్పిలి బాజీ కామరాజు భాగ్యలక్ష్మి దంపతులు చే కళ్యాణం మహోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం సుమారుగా 5000 మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు.శ్రీ సాయి నాట్యమండలి శిరీష ర్యాలీ శిష్యబంధం జానపద నృత్య ప్రదర్శన, తిమ్మా పాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో అన్నమాచార్య వాగ్దేయ వరదాయని బృంద సభ్యురిచే సంకీర్తనలు, కోలాటకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాశ్వత కమిటీ సభ్యులు, గౌరవ అధ్యక్షులు. కొణతాల జగన్నాథ రావు నాయుడు, అధ్యక్షులు. కె నారాయణ రావు మాస్టారు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి. దాసి రెడ్డి వెంకటేశ్వరరావు. సత్తివాడ దుర్గారావు,ఉత్సవ కమిటీ చైర్మన్ తిమ్మ పాత్రుని వెంకటేష్, కార్యదర్శి. సిరసపల్లి రాజు, కోశాధికారి.పాముల ప్రసాద్. ఆలయ కన్వీనర్ కుంచ చిన్న, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు, ఉచిత మజ్జిగ పంపిణీ

బుచ్చయ్యపేట జనవరి 27 ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం పొట్టిదోరపాలెం గ్రామం కొత్తూరు లో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్డి సత్యారావు తమ సొంత గ్రామమైన పొట్టి దోరపాలెం గ్రామంలో వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆఫీస్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. బియన్ రోడ్డు లో వెళ్తున్న వాహన మిత్రులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ప్రతిరోజు కూడా మినరల్ వాటర్ పెట్టి అందరికీ అందుబాటులో దాహం తీర్చే విధంగా ప్రయత్నిస్తానని చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమానికి బిజెపి కార్యకర్త చింతల వెంకటేశ్వరరావు,కొల్లిమ్మల్ల దేముళ్ళు,కొర్ని సూర్య ప్రకాష్, సత్తిబాబు, రమణ, రాము, అందరూ కలిసి ప్రారంభించారు. అటు అనంతరం యువత అంతా కలిసి కట్టుగా వెళ్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసారు. వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ వడ్డీ సత్యరావు యొక్క సేవలు అంచులంచులుగా ఎదుగుతున్నాయని గ్రామ ప్రజలంతా సత్యరావుని అభినందించడం జరిగినది.

## గొర్లెపాలెంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు...

బుచ్చయ్యపేట మార్చి 27 ప్రభాతవార్త



బుచ్చయ్య పేట మండలం గొర్లెపాలెం గ్రామంలో రాములవారి కళ్యాణాన్ని తిలకించేందుకు గ్రామ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారికి నూతన పట్టు వస్త్రాలు ధరించి, అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర బెల్లం శుభ సన్నివేశం తర్వాత తలంబ్రాలు వేడుక, మధ్యాహ్నం స్వామి వారి తీర్థప్రసాదాలు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సీతారాములవారిని పల్లకిలో గ్రామం అంతా ఊరేగించారు. ఈ యొక్క స్వామివారి కల్యాణోత్సవం కార్యక్రమంలో ఇందలి గోవింద పావని దంపతులు, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా సీతారాముల కళ్యాణం

అడ్డు రోడ్డు / నక్కపల్లి ఏప్రిల్ 27 ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో అత్యంత వైభవంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా గ్రామంలో వెలిసిన సీతారాముల ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు అభిషేకాల అనంతరం స్వామి వారి ప్రసాదు వితరణ కావించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను అలంకరించి వేదమంత్రాలతో అత్యంత వైభవంగా కళ్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణాన్ని వీక్షించారు. అనంతరం రామాలయ వద్ద దాతల సహకారంతో భారీ ఎత్తున అన్నదాన సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పేకేటి రాజారావు. సర్పంచి పొడగట్ల వెంకటేశ్వరరావు. ఎంపీటీసీ బచ్చల రాజు మాజీ పిఎసిఎస్ చైర్మన్ పొడగట్ల పాపారావు. తుమ్మల లక్ష్మణరావు, కోలపాటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## పాల్తేరులో ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు

పాయకరావుపేట రూరల్, మార్చి 27, ప్రభాతవార్త



మండలంలోని పాల్తేరులో శ్రీరామనవమి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో ప్రముఖ న్యాయవాది దేవవరపు రాంబాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. పోలీస్ అధికారి యెన్ని రాంబాబు, కల్పన దంపతులు కళ్యాణకర్తలుగా వ్యవహరించగా పండితులు సకల సౌభాగ్యాలకు నెలవైనటువంటి లక్ష్మీ స్వరూపిణి సీతమ్మవారిని సకల గుణాభిరాముడు, ధర్మ స్వరూపుడు అయిన శ్రీరామచంద్రమూర్తికి ఇచ్చి వేదోక్తంగా వివాహం జరిపించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో తలంబ్రాల ఉత్సవాన్ని నిర్వహించారు. కేరళ డ్రమ్స్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పాల్తేరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అదేవిధంగా మండలంలోని అరట్లకోట, గుంటపల్లి, పిఎల్ పురం, నామవరం, మంగవరం, పెంటకోట, కుమారపురం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు.

## జిల్లా రిజిస్ట్రార్ నరసింహమూర్తికి సత్కారం..

### ఒక మంచి అధికారి నర్సింహమూర్తి కొప్పిశెట్టి



నక్కపల్లి ,ప్రభాతవార్త

నక్కపల్లి సబ్ రిజిస్టర్గా పనిచేస్తూ జిల్లా రిజిస్టర్గా పదోన్నతి పొంది పాడేరు జిల్లా రిజిస్టర్ గా నియమితులైన సందర్భంగా చెన్నా నరసింహ మూర్తిని నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు ఒక మంచి అధికారి చెన్న నరసింహమూర్తి అని, అటువంటి ఉద్యోగి ఎక్కడ పని చేసిన గుర్తింపు ఉంటుందని అన్నారు. నరసింహమూర్తి కి జిల్లా అధికారిగా నక్కపల్లి నుంచి పదోన్నతి పొందడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఆయనతోపాటు సత్కరించిన వారిలో విశ్రాంతి ఉపాధ్యాయులు శేఖర్, పట్టణ దేశం అధ్యక్షులు అడ్డూరి లోవరాజు ,స్కూల్ చైర్మన్ టిడిపి పట్టణ నాయకులు అడ్డూరి పెద్ద, పచ్చిపులుసు నాగేశ్వరరావు తో పాటు పలువురు ఉన్నారు.

## మన దేశ ప్రజలకు మోడీ లాంటి ప్రధాని దొరకడం అదృష్టం: కోసూరి

నక్కపల్లి ,ప్రభాతవార్త



ప్రధానమంత్రి తీసుకున్న సాసోపేతమైన నిర్ణయం చాలా హర్షించదగ్గ విషయం అని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కోసూరి శ్రీనివాసరావు అన్నారు. మండల బిజెపి కార్యాలయం లో శుక్రవారం స్థానిక విలేకరులతో శ్రీనివాసరావు మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్పై ప్రధాని నరేంద్ర మోడీ సుంకాలను తగ్గించడం భారతదేశం గర్వించదగ్గ విషయమని, ఇటువంటి విపత్కర యుద్ధ సమయంలో చాలా దేశాలు ఆయిల్ పై రేట్లు పెంచి కొన్ని దేశాలలో సప్లై కూడా చేయలేని స్థితిలో ఉన్నాయి కానీ ఆ నేపథ్యంలో ఇటువంటి నిర్ణయం తీసుకోవడం ప్రపంచం మెచ్చుకునే నాయకుడు ప్రధాని అని అన్నారు. మధ్యతరగతి సాధారణ వ్యక్తులపై భారం పడకూడదని ఆలోచనతో సుంకాలను తగ్గించారు అని చెప్పారు. ప్రభుత్వంపై ఎంత భారం పడినా భారతదేశంలోని మధ్యతరగతి ప్రజలపై భారం పడకూడదు దేశంలోని ప్రజలు ఇబ్బంది పడకూడదు అనే ఆలోచనతో రేట్లు తగ్గించడం పట్ల బిజెపి పార్టీ కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. పరిపాలించే నాయకుడు మోదీ అయితే దేశం భారతదేశం లో ఉంటుందని మరొక్కసారి ఈ విషయంలో రుజువైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోలినాటి నానాజీ, బీజేపీ సీనియర్ నాయకులు కొలనాటి అప్పారావు, నున్న జ్యోతిబసు, బంగారి శివ తదితరులు పాల్గొన్నారు.

## కశింకోట కస్బా వీధి సీతారాములను దర్శించుకున్న ఎంవిఆర్



కశింకోట, మార్చి 27, ప్రభాతవార్త

శ్రీరామనవమిని పురస్కరించుకొని కశింకోట కస్బా వీధి లో శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు పిఎసిఎస్ చైర్మన్ సిద్ది రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కళ్యాణానికి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ప్రముఖ వాణిజ్య వేత్త ముత్యాల గార్మెంట్స్ అధినేత బిజెపి నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావుతో కలసి విచ్చేశారు. వారికి ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికారు. సీతారాముల దేవాలయానికి తీసుకువెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అక్షర భారతం సొసైటీ చైర్మన్ మైలపల్లి రమణ శ్రీరామనవమి ప్రాముఖ్యతపై సందేశం

(రాంబిల్లి మార్చి 27 ప్రభాతవార్త)



రాంబిల్లి మండలం వెంకయ్య పాలెం గ్రామం లో శ్రీరామనవమి సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది, శ్రీరామనవమి భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన పవిత్ర పర్వదినం అని అక్షర భారతం సొసైటీ (ఎన్జీవో) చైర్మన్ మైలపల్లి రమణ తెలిపారు, శ్రీరాముడి అవతారం ధర్మ పరిరక్షణకు సత్యం, నీతి, న్యాయం స్థాపనకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. ఈ పండుగ ద్వారా కుటుంబ విలువలు, సామాజిక సమగ్రత, భక్తి భావం పెంపొందుతాయని అన్నారు, ప్రతి ఒక్కరూ శ్రీరాముడి జీవన విధానాన్ని ఆదర్శంగా తీసుకొని నిజాయితీ, కర్తవ్యం నిర్వహణ, పరస్పర గౌరవం వంటి విలువలను ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు, రామాలయం మందిరంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు, ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీరామునికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు, గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని శ్రీరాముని ఆశీస్సులు పొందారు, అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు, గ్రామంలో ఉన్న చిన్నారులు కోలాటంతో అలరించారు, ఈ కార్యక్రమంలో ఎరిపల్లి అప్పలకొండ, మైలపల్లి బంగారు చిట్టి, మైలపల్లి గోవింద్, ఎజ్జల నూకరాజు, నాగరాజు, సత్తిబాబు, దూద రమణ, చెల్లూరి అప్పలరాజు మరియు గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు

### పలు ఆలయాలను సందర్శించిన ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్)



అనకాపల్లి మార్చి 27, ప్రభాతవార్త

శ్రీరామనవమి అంటే కేవలం శ్రీరాముడి జన్మదినం మాత్రమే కాదని, సీతారాముల కళ్యాణ మహోత్సవం కూడా అని ప్రముఖ వ్యాపారవేత్త భారతీయ జనతా పార్టీ నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్) పేర్కొన్నారు.ఈ మేరకు శుక్రవారం పట్టణంలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కూడా పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఎం వి ఆర్ మాట్లాడుతూ శ్రీరామచంద్రుని జీవితం మనందరికీ ఆదర్శమని, రామనామ స్మరణం మనస్సులో ప్రశాంతతను, సమాజంలో ధర్మాన్ని నింపుతుందన్నారు. మన పురాతన సాంప్రదాయాలను, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకోవడం మన బాధ్యత అని, రామయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎం వి ఆర్ ఆకాంక్షించారు. దీనిలో భాగంగా, మెయిన్ రోడ్ లోని శ్రీరాములవారి ఆలయాన్ని మొదటగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు, ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతూ ఎంవిఆర్ను లోపలికి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, చిన్నవీధి లో వేంచిసి యున్న శ్రీసీతారాముల వారి దేవస్థానంను దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అదేవిధంగా విజయరామరాజుపేటలోని శ్రీసీతారామ దేవస్థానంను దర్శించుకున్నారు. ఈ మేరకు విజయరామరాజుపేట గ్రామ కమిటీ సభ్యులు ఎం వి ఆర్ కు ఘనంగా స్వాగతం పలుకుతూ స్వామివారి దర్శనం చేయించారు. దీనిలో భాగంగా ఆయన చేతుల మీదుగా అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే, మండలంలోని కొప్పాక పరిధికి చెందిన, కొత్తూరు నర్సింగరావుపేటలోని రామమందిరం ను దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ ప్రతినిధులు, ఎం వి ఆర్ కు ఘన స్వాగతం పలికి కండువా కప్పి ఘనంగా సత్కరించారు. స్వామివారి నైవేద్యం కొరకు తయారుచేసిన పానకమును ఎం వి ఆర్ కు అందించారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో బిజెపి కార్యకర్తలు, ఎం వి ఆర్ అభిమానులు, మహిళలు మరియు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా సీతారాముల వారి కళ్యాణం

### భక్తులకు భారీ అన్న సమారాధనలు

అనకాపల్లి మార్చి 27,(ప్రభాతవార్త)



శ్రీరామ నవమి పర్వదిన సందర్భంగా సీతారాముల వారి కళ్యాణం శుక్రవారం అనకాపల్లి పట్టణంతోపాటు గ్రామాల్లో ఉన్న రామాలయాల వద్ద అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్నంలోని గవరపాలెం పెద్ద రామస్వామి కోవెల ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. దాడి జగన్ ప్రభాకర్ షర్మిల దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని దాడి రత్నాకర్ అచ్యుత దంపతులు ప్రారంభించారు. స్థానిక పూడిమడక రోడ్డులో ఉన్న రామాలయంలో సీతారాముల వారి కళ్యాణం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ నాగ జగదీశ్వరరావు ఈ వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక నర్సింగరావుపేట శ్రీ శారద బాల గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల వారి కళ్యాణంలో మాజీ కార్పొరేటర్, వైసిపి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకరామరాజు సునీత దంపతులు పాల్గొని సీతారాములవారిని దర్శించుకున్నారు. కొత్తూరు శారద నగర్, ఎన్జీవో కాలనీ షిరిడి సాయి బాబా ఆలయం, విజయరామరాజుపేట, లక్ష్మీదేవి పేట తదితర ప్రాంతాల్లో సీతారాముల వారి కళ్యాణం నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు





## అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



ఎస్.రాయవరం మార్చి 27 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఎస్ రాయవరం మరియు పరిసర గ్రామాలలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగాయి. ఎస్ రాయవరం ఉప్పరపల్లి. సైతారు పేట, ధర్మవరం అగ్రహారం దార్లపూడి, తిమ్మాపురం, కొత్త పోలవరం, కోనవానిపాలెం, వెంకటాపురం, తదితర గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణంలో భారీ సంఖ్యలో భక్తులు ఈ వేడుకలు కనులారాతిలకించారు. స్వామివారి ప్రసాదములు పానకములు, తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. కొత్త పోలవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచులు శ్రీపతి రాజు, వెంకటరాజు ఆయా గ్రామాల పెద్దలు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మధు వర్మ, పోచిన నరేష్, వర్మ, అప్పలరాజు,వెంకటరాజు, సింహాద్రి,బద్ది వారి కుటుంబ సభ్యులు, దుబాసి రమేష్ దంపతులు పాల్గొన్నారు.

## శారదాకాలనీలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

అనకాపల్లి, మార్చి27 ప్రభాతవార్త



పట్టణంలోని శారదాకాలనీ నాలుగవ వీదిలో శ్రీరామ నవమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్టేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోషియేషన్ ఉపాధ్యక్షులు, ఉషోదయ, దేవన్స్ స్కూల్స్ వ్యవస్థాపకులు జె.రమణాజీ, రాణి దంపతులు సీతారాముల ఉత్సవ ప్రతిమలను ఉరేగింపుగా తీసుకు వచ్చి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ప్రముఖ వైద్యులు జి.రామ్మూర్తి ప్రదాన అతిదిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ ఇద్యక్షులు ఎస్ కిషోర్ కుమార్, కల్కి శ్రీను నేతృత్వం వహించి ప్రసాద వితరణ గావించారు.

## శ్రీరామనవమి సందర్భంగా పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే

అచ్చుతాపురం, మార్చి 27, ప్రభాతవార్త



అచ్చుతాపురం మండలంలో ఉన్న పలు దేవాలయాలలో ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందర పు విజయకుమార్ శ్రీరాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాల కు ప్రతీకగా శ్రీరామనవమి పర్వదినాన్ని జరుపుకుం టామని, ఈ పండగ ప్రతి తెలుగువారి జీవితాల్లో కొత్త ఆశలు ఆనందాలు తీసుకురావాలని ఆకాంక్షించారు, ఎలమంచిలి నియోజకవర్గ ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరూ తమ లక్ష్యాలను సాధిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని సూచించారు, శ్రీరామనవమి పర్వదినం రాష్ట్రానికి మరింత అభివృద్ధి, ప్రజలు శ్రేయస్సు తీసుకురావాలని కోరారు, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, పెద్దలు, మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చోడపల్లిలో భారీ అన్న సమారాధన

(అచ్చుతాపురం, మార్చి 27, ప్రభాతవార్త



అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు, సీతారాముల కల్యాణోత్స వం సందర్భంగా వేద పండితుల మంత్రోత్సవాల మధ్య భక్తుల కోలాహలం నడుమ స్వామివారి కళ్యాణం కనుల పండుగగా సాగింది, ఈ పర్వదినాన ప్రత్యేక పూజలు నిర్వహించారు, కర్రీ వెంకటరమణ, గంజి రామకృష్ణ ఆర్థిక సహాయంతో సుమారు 1500 మందికి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, చుట్టుపక్క గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలు



నక్కపల్లి, ప్రభాతవార్త

మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలను ఉత్తరాంధ్ర చిరంజీవి ఫ్రాన్స్ నిర్వాహకులు మీగడ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నక్కపల్లిలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కోసూరి శ్రీనివాసరావు, టిడిపి మండల పార్టీ నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ (కేవీ), జనసేన పార్టీ నాయకులు వెలగ సుధాకర్, ముద్ద పెద బాబ్జి, కర్రీ నానాజీ ,స్కూల్ చైర్మన్ పెద్దిరెడ్డి రమేష్, అల్లాడ తాతారావు, సకురు వెంకటరమణ తోపాటు మెగా అభిమానులు, జనసేన పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## సిపిఎం నిరసన

నక్కపల్లి, రూరల్ ప్రభాతవార్త



గ్యాస్ సిలిండర్ల సరఫరాలో నెలకొన్న తీవ్ర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్ శుక్రవారం మండలంలోని ఎన్. నర్సాపురం గ్రామంలో తన నివాసం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా సాధారణ ప్రజలు గ్యాస్ సిలిండర్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు మళ్లీ పాత కాలానికి వెళ్లి కట్టెల పొయ్యిపై వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా కట్టెల పొయ్యిపై నీళ్లు మరగబెట్టి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్యాస్ సిలిండర్ల సరఫరాను సక్రమంగా అందుబాటులోకి తీసుకురావాలని, ధరలను నియంత్రించాలని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## దిమిలి గ్రామంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ పార్లమెంటు సభ్యులు

రాంబిల్లి,మార్చి 27, ప్రభాతవార్త



రాంబిల్లి మండలం, దిమిలి గ్రామంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. అనంతరం భారీ అన్న సమారాధన లో పాల్గొన్నారు, ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రీరాముడి జీవన విధానాన్ని ఆదర్శంగా తీసుకొని నిజాయితీగా పరస్పర గౌరవంతో కూడిన విలువలను ఆచరించాలని, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజానికి ఉపయోగ పడాలని ఆయన సూచించారు. దైవం పట్ల విశ్వాసం ప్రజా సంక్షేమం రెండూ రెండు కళ్లు గా సాగుతున్న కూటమి పరిపాలనకు ఆ అయోధ్య రామయ్య ఆశీస్సులు మన రాష్ట్రంపై సదా ఉండాలని కోరనన్నారు, నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు టిడిపి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో నేచురోపతి ఉచిత వైద్య శిబిరం



గూడెం కొత్తవీధి మార్చి 27, ప్రభాతవార్త

మండల కేంద్రంలో ఈనెల 30న సోమవారం నాడు జి కె వీధి కమ్యూనిటీ భవనం నందు ఇన్స్టిట్యూట్ ఆఫ్ అక్యుపంచర్ నేచురోపతి (హైదరాబాద్) వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని గూడెం కొత్త ఎంపీటీసీ రీమల రాజేశ్వరి,సర్పంచ్ కోర్ర సుభద్ర,జనసేన ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ తెలియజేశారు. ఎటువంటి రసాయన ఔషధాలు అవసరం లేకుండా అక్యుపంక్చర్ చికిత్స ద్వారా శరీరంలో నాడీ వ్యవస్థ పనితీరు తెలుసుకొని అన్ని వయసుల వారికి పూర్తిగా ఉచిత వైద్యం అందిస్తారని, దీర్ఘకాలికంగా వ్యాధులతో బాధపడేవారు కూడా ఈ శిబిరానికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు పొందాలని, ఈ అవకాశం మండలం వాసులు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ముక్కల రమేష్,హ్యూమన్ రైట్స్ నెంబర్ బత్తుల రాజు, గూడెం కొత్త వీధి వైద్య సిబ్బంది, ఉద్యోగస్తులు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## వినీత్ కుటుంబ సభ్యులకు సర్వేయర్ సంఘం ఆర్థిక సాయం

అరకులోయ, మార్చి 27, ప్రభాత వార్త



అరకులోయ మండల కేంద్ర పరిధిలోని జడ్పీ కాలనీ నందు నివాసం ఉంటున్న వినీత్ కుమార్, గ్రామ సచివాలయ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవలే అనారోగ్యంతో మరణించిన విషయం విధితమే. ఈ ఈ మేరకు శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా సర్వేయర్ యూనియన్ సంఘం తరపున ఉపాధ్యక్షులు శివరాజ్ కుమార్, జాయింట్ సెక్రటరీ మణికంత, వెల్ఫేర్ అసిస్టెంట్ వీరయ్యలు, వినీత్ స్వగృహానికి చేరుకొని కుటుంబ సభ్యులకు యూనియన్ తరపున రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, సహాయం అందించినందుకు యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అరకులోయలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



అరకులోయ, మార్చి 27, ప్రభాతవార్త

అరకులోయ మండలంలోని రామాలయాల్లో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు వేకువ జామునే తలంటు స్నానాలు చేసి దేవాలయాలకు చేరుకొని రాముల వారి కళ్యాణ వేడుకలో పాల్గొన్నారు. సీతా రాముల కళ్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు దేవాలయాలకు చేరుకున్నారు. మండలంలోని కొత్తవలస శ్రీ కోదండ రామాలయం, పప్పుడు వలస, యండపల్లివలస, పానిరంగిని తదితర గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేదిక అంగరంగ వైభవంగా జరగగా, శ్రీ రాముని నామ స్వరంతో దేవాలయాలు మారు మ్రోగాయి. అలాగే శ్రీరామ నవమి సందర్భంగా ఆలయాల వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

## మాడుగులలో భారత్ గ్యాస్ కోసం వినియోగదారులు ఎదురుచూపులు

అరకులోయ, మార్చి 27, ప్రభాతవార్త



పర్యాట కేంద్రమైన అరకులోయ లో భారత్ గ్యాస్ వినియోగదారుల కష్టాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇటీవల కాలంలో గ్యాస్ కొరత ఏర్పడడంతో అరకులోయలో భారత్ గ్యాస్ కొరకు వినియోగదారులు బారులు తీరుతున్నారు. అరకులోయలో భారత్ గ్యాస్ ఏజెన్సీకి సంబంధించి గోడౌన్ లేకపోవడంతో వినియోగదారుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. ప్రస్తుతం మైదాన ప్రాంతాలు ఎస్ కోట, మాడుగుల నుండి అరకులోయ కు భారత్ గ్యాస్ సరఫరా అవుతుంది. అయితే మాడుగుల శ్రీ వెంకట సీతారామ భారత్ గ్యాస్ ఏజెన్సీస్ కి చెందిన భారత్ గ్యాస్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక వినియోగదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. చివరికి గ్యాస్ బుక్ చేసుకున్న వారికి కూడా గ్యాస్ వ్యాన్ అరకులోయ కు ఎప్పుడు వస్తుందో తెలియక , సరైన సమాచారం అందక ఇబ్బందులు పడుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. శ్రీ వెంకట సీతారామ భారత్ గ్యాస్ ఏజెన్సీస్ నిర్వాహకులు కావాలనే గ్యాస్ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారా అన్న సందేహాలను వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ సమస్యపై దృష్టి కేంద్రీకరించి భారత్ గ్యాస్ వినియోగదారుల కష్టాలను తీర్చాలని అరకులోయ భారత్ గ్యాస్ వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా డొమెస్టిక్ భారత్ గ్యాస్ బ్లాక్ మార్కెట్ లో 1500 నుండి 2000 రూపాయల వరకు విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై సంబంధిత శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని భారత్ గ్యాస్ వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## రెండు బైకులను ఢీకొన్న గుర్తుతెలియని కారు..!

### ముగ్గురికి తీవ్ర గాయాలు, ఇద్దరికి స్వల్ప గాయాలు



కొయ్యూరు మార్చి 27 ప్రభాతవార్త

మండలంలోని రామరాజుపాలెం వద్ద హైవేలో గుర్తు తెలియని ఒక కారు ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టడంతో బైకులపై ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్ర గాయాల పాలవగా, ఇద్దరు స్వల్ప గాయాల పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం మధ్యాహ్న సమయంలో చింతపల్లి వైపు నుండి కృష్ణదేవిపేట వైపు వస్తున్న ఒక గుర్తు తెలియని కారు మండలంలోని రామరాజుపాలెం వద్ద ఎదురుగా వస్తున్న రెండు బైకులను ఒకదాని తర్వాత ఒకటిగా బలంగా ఢీకొట్టడంతో బైకులపై ప్రయాణిస్తున్న చింతపల్లి మండలం ఎర్రచెరువులు, తప్పల మామిడి గ్రామాలకు చెందిన డి.మంగ కుమారి, టి.సాంబ టి.సురేష్ తీవ్ర గాయాల పాలవగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొయ్యూరు 108 వాహనం పై నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కిండంగి గ్రామంలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

పాడేరు,మార్చి27,ప్రభాతవార్త:



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం కిండశిగి గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు ఆలయ కమిటీ నిర్వాహకులు టిడిపి సీనియర్ నాయకులు,రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, మాజీ ఎంపీపీ బొర్రా విజయ రాణి దంపతులు,ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు కిండశిగి, నక్కలపుట్టు, సెరిబయలు, వర్తనాపల్లి, కాడేలి చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు హాజరై సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం కల్యానానికి హాజరైన భక్తులకు అన్న ప్రసాదాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేసారు. కళ్యాణ మహోత్సవం కార్యక్రమం టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు,మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి,పాడేరు ఎంపీపీ రత్నకుమారి, మాజీ ఎం.పీ.పీ రమణమూర్తి, సర్పంచ్ శ్రీలక్ష్మీ, విశ్వనాథం, ఉప సర్పంచ్ శరభ రాములమ్మ, గుజ్జె కనకరాజు, పంచాయితీ కార్యదర్శి కె.అమృత, గ్రామ పెద్దలు ఎల్.నాగేశ్వరరావు,బొర్రా నూకరాజు, ఏం.అప్పారావు, కూడా సత్యనారాయణ, కుడా సిద్ధేశ్వరరావు, జే.అప్పారావు,బుక్క జగదీష్,బొర్రా శంకర్ రాజు, మణికంఠ రాజు, నటరాజు గ్రామ పెద్దలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పణ



పాడేరు,మార్చి27,ప్రభాతవార్త

శ్రీ సీతారాముల వారి కళ్యాణమునకు పట్టు వస్త్రములు సమర్పించిన పాడేరు గిరి కైలాస క్షేత్ర ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు. శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి దేవాలయం తరపున సాంప్రదాయముగా స్వామి వారి కళ్యాణమునకు పట్టు వస్త్రములు సారి తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ఉప్పల వెంకటరత్నం, వైదేహి, ఉడా త్రినాథ్, కొట్టగుల్లి రామారావు యముడు ప్రభాకర్ రావు కాత్యాయని, కోన,కొమ్మోజి వెంకటరమణ, కొట్టగుల్లి పోతురాజు, సిద్ధనాతి కొండలరావు,నవర గోవిందరావు, యాదగిరి శ్రీనివాసరావు, పలాస బాలన్న,దాసరి నాగు ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు శ్రీ రామాలయం ఆలయ కమిటీ చంద్రు పుట్టు వారికి సమర్పించారు..

## గతానికి భిన్నంగా.. శ్రీరామనవమి పండగ..!

### రాజేంద్రపాలెంలో భారీ అన్నసంతర్పణ.. కోలాటాలతో ఊరేగింపు



కొయ్యూరు మార్చి 27 ప్రభాతవార్త

గతంలో తూతూ మంత్రంగా సాగే మండల కేంద్రమైన రాజేంద్రపాలెంలోని రామాలయ శ్రీరామనవమి వేడుకలు, ఇప్పుడు గతానికి భిన్నంగా సాగాయి. రాజేంద్రపాలెంలో ఉదయం సాంప్రదాయబద్ధంగా సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించిన భక్తులు, మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ చేసి, సాయంత్రం కోలాటాలతో, భక్తి గీతాల నృత్యాలతో విద్యుత్తు వెలుగులతో భారీ ఊరేగింపు నిర్వహించి, చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు. గ్రామ పెద్దలు కాకర చిన్నారావు, కాకర గంగరాజు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, దిబ్బ సత్తిబాబు, సవిర్ల సత్యనారాయణ, బయ్యవరపు రామారావు, కురం దాసు దావీదు, దిబ్బరత్నం, దిబ్బ కుమారి, కాకర సోమరాజు, కామోజు రమేష్ తదితర పెద్దలు ఆద్యంతం పర్యవేక్షించి విజయవంతం చేశారు.

## గంజాయి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

### ఆదివాసీలు దూరంగా ఉండాలి ..రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

పాడేరు,మార్చి27, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు షెడ్యూల్ జిల్లాలో గంజాయి, మరక ద్రవ్యాలు విలయతాండవం చేస్తున్నది. యువకులు, విద్యార్థులు, అమాయక ఆదివాసులు గంజాయి,నాటుసారా మహమ్మారి బారిన పడుతున్నారని పూర్తి స్థాయిలో నివారిం చేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక, విద్యార్థి, మహిళా, ఆదివాసీ, ప్రజా సంఘాలు ,స్వచ్ఛంధసంస్థలు సమష్టి కృషితో గంజాయి, మరక ద్రవ్యాలు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు నిచ్చారు. పాడేరు జిల్లా కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ ధర్మన్నపడాల్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పటైన వంద రోజులలో గంజాయి నివారిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదని ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి నాటుసారా విపరీతంగా పెరిగిపోయిందని యువకులు, విద్యార్థులు, అమాయక ఆదివాసులు గంజాయి, మారకద్రవ్యాల మహమ్మారి బారిన పడుతున్నారని చదువుకున్న ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం తదితర సమస్యలు తాండవించడం వలన గంజాయి నిర్మూలన సాధ్యం కాలేదని రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆదివాసులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదివాసి ప్రాంతంలో 100% ఉద్యోగ నియామక చట్టం చేసి ఆదివాసి ఉద్యోగాలు మొత్తం ఆదివాసులతో భర్తీ చేయాలని ప్రభుత్వం వంద రోజుల్లో గంజాయి నిర్మూలన చేస్తారన్న మాట ఉత్తే మాటలకే పరిమయిందని వీటికి సంబంధించి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గంజాయినిర్మూలకు విస్తృతంగా ప్రచారం సంతల్లో గ్రామాల్లో విద్యాసంస్థల్లో సెమినార్స్ సదస్సులు నిర్వహించి విస్తృతంగ ప్రచారం నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు రాజు, నిరుద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాను, సిహెచ్ రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చిన్నారావ్ ,ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు దాసు, వాలంటరీ సంఘం నాయకులు సత్యారావు, డెల్లాపల్లి హీల్స్ సొసైటీ అధ్యక్షులు బొంజు బాబు పాల్గొన్నారు.

## కాకరపాడులో తీర్థ మహోత్సవాలు ప్రారంభం

### గ్రామగ్రామాన అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం



కొయ్యూరు మార్చి 27 ప్రభాతవార్త

శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం మండలంలోని గ్రామ గ్రామాన ఉన్న సీతారాముల ఆలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాలను స్థానికులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాకరపాడు, మర్రివాడ, యు. చీడిపాలెం, కంటారం, బాలారం, రాజేంద్రపాలెం, కొయ్యూరు, రావాలా మంప, ఎం.మాకవరం, చింతలపూడి తదితర గ్రామాలలో కళ్యాణ మహోత్సవాలను సాంప్రదాయంగా నిర్వహించి, అన్న సంతర్పణలు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా సాంప్రదాయబద్ధంగా గత 80 సంవత్సరాలకు పైగా జలుమూరి కుటుంబీకుల ఆధ్వర్యంలో సాగుతున్న కాకరపాడు శ్రీరామనవమి తీర్థ మహోత్సవాలు శుక్రవారం సీతారాముల కళ్యాణంతో ప్రారంభమయ్యాయి. చిటికెల కిషోర్, లక్ష్మి దంపతులు సీతారాములుగా కళ్యాణాన్ని జరుపుకున్నారు. అటుపై అన్నసంతర్పణ నిర్వహించారు. వారం రోజులపాటు సాగే ఈ కాకరపాడు తీర్థ మహోత్సవాలకు వేల సంఖ్యలో చూపరులు రావడం ఆనవాయితీ.

## ముందస్తు జాగ్రత్తగా నిలిపివేసిన డ్రోన్ పరీక్షా విమానం

### ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా సురక్షితంగా ల్యాండింగ్ చేసిన పైలట్ -పాడేరు -ముంచింగిపుట్టు మార్గంలో సాంకేతిక వ్యత్యాసం గుర్తింపు

పాడేరు,మార్చి27, ప్రభాతవార్త:



అల్లూరి సీతారామరాజు జిల్లాలో డ్రోన్ సేవల పనితీరును పరిశీలించే క్రమంలో గురువారం సాయంత్రం ఒక పరీక్షా విమానాన్ని అధికారులు ముందుజాగ్రత్తగా ల్యాండ్ చేశారు. పాడేరు నుండి ముంచింగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రం వరకు డ్రోన్ పనితీరును ధృవీకరించే లక్ష్యంతో ఈ ప్రయోగాత్మక ప్రయాణాన్ని నిర్వహించారు. అయితే, గాలి వేగంలో అసాధారణ మార్పులు గమనించిన సాంకేతిక బృందం, ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తుగా విమానాన్ని కిందకు దించారు. గురువారం మధ్యాహ్నం 3:40 గంటల సమయంలో పాడేరు నుండి బయలుదేరిన డ్రోన్, భూమికి సుమారు 400 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్నప్పుడు గాలి వేగాన్ని కొలిచే పరికరాల్లో స్వల్ప వ్యత్యాసం కనిపించింది. డ్రోన్ నిబంధనల ప్రకారం భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఆపరేషన్స్ బృందం వెంటనే అప్రమత్తమైంది. ఆటోమేటెడ్ మార్గాన్ని నిలిపివేసి, పైలట్ తన నియంత్రణలోకి తీసుకున్నారు. పెదబయలు సమీపంలోని గంపరాయి గ్రామం, బోయితేలి వద్ద ఎటువంటి జనసమ్మర్ధం లేని ఖాళీ ప్రదేశాన్ని గుర్తించిన బృందం, డ్రోన్‌ను అక్కడ సురక్షితంగా ల్యాండ్ చేసింది. ఈ ప్రక్రియలో ప్రజలకు కానీ, ప్రైవేటు ఆస్తులకు కానీ ఎటువంటి నష్టం వాటిల్లలేదు. డ్రోన్ పరికరం కూడా ఎటువంటి దెబ్బతినకుండా క్షేమంగా ఉందని సాంకేతిక సిబ్బంది వెల్లడించారు. డ్రోన్ ల్యాండ్ అయిన వెంటనే స్థానిక గ్రామస్థులకు పరీక్షా ప్రయాణం యొక్క ఉద్దేశాన్ని మరియు సాంకేతిక కారణాల వల్ల నిలిపివేయాల్సి వచ్చిన విషయాన్ని బృందం వివరించింది. ప్రజల్లో ఎటువంటి ఆందోళన కలగకుండా పూర్తి పారదర్శకతను పాటించారు. అనంతరం డ్రోన్‌ను విడదీసి సురక్షితంగా బేస్ క్యాంపునకు తరలించారు. గాలి వేగంలో వ్యత్యాసానికి గల కారణాలను విశ్లేషించడానికి ఫ్లైట్ లాగ్‌లను పరిశీలిస్తున్నామని, సెన్సార్ల పునఃపరిశీలన చేపడుతున్నామని రెడ్వింగ్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. జిల్లా అధికారులకు ఈ ఘటనపై పూర్తి నివేదికను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## సీతారాములను దర్శించుకున్న జీసీసీ చైర్మన్



హుకుంపేట, మార్చి 27,ప్రభాత వార్త

హుకుంపేట మండలంలో గల గడుగుపల్లి శ్రీ సీతారాములవారిని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. హుకుంపేట మండలం తాడేపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవ వేడుకలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ కిలగడ సింహాచలం, మాజీ జడ్పీటీసీ సాగర వసంత కుమారి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు శ్రీ రాములువారిని దర్శించుకున్నా అనంతరం గ్రామస్తులు దుస్సలువతో సన్మానించారు. ఆ శ్రీరాములవారి అశస్సులు ప్రతి ఒకరి మీద వెల్లవేళలా ఉండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు దంపతులు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, ఎంపీటీసీ కొమ్మ రమ స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి టీడీపీ సీనియర్ నాయకులు సోమేలి లక్ష్మయ్య,త్రినాధ్, మహేశ్వరీ, మహేష్, స్వామి అప్పలకొండ గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా పురాతన రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు

అచ్చుతాపురం మార్చి 27 ప్రభాతవార్త



అచ్చుతాపురం మండల కేంద్రంలో ఉన్న రామాల యంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ మెంబర్ శ్యామ్ శ్రావణి దంపతులు సీతారాముల కళ్యాణ మహోత్సవంలో కూర్చొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ బాబ్జి, ఆలయ కమిటీ ఎన్.రాజు, సింహాద్రి, కరుణ నాయుడు, గోవిందు, డి.రాజు మరియు యూత్ సహాయంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు, ఈ కార్యక్రమంలో భక్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## తెలుగు ఉపాధ్యాయునికి అరుదైన పీహెచ్‌డి పట్టా

కొయ్యూరు మార్చి 27 ప్రభాతవార్త



మండలంలోని మంప గ్రామానికి చెందిన, మండలంలోని నడిం పాలెం జిపిడబ్ల్యూఏ స్కూల్లో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సాగిన రాజుబాబు అరుదైన పీహెచ్డీ పట్టా అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, అలాగే ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అలాగే పట్టా గ్రహీత గైడ్ అయినటువంటి ప్రొఫెసర్ జర్రా అప్పారావు చేతులు మీదుగా ఈనెల 25న జరిగిన 91 మరియు 92 కంబైన్డ్ కన్వకేషన్ ఆంధ్ర యూనివర్సిటీ స్నాతకోత్సవంలో సాగిన రాజుబాబు అల్లూరి జిల్లా నుంచి తెలుగులో మోక రత్న రాజు రచనలు-పరిశీలన' అనే అంశం మీద పరిశోధన చేసినందుకు గాను తెలుగులో పీహెచ్డీ పట్టా అందుకున్నారు. పట్టాగ్రహిత రాజబాబును పలువురు అభినందిస్తున్నారు.

## రోడ్లపై గుంపులుగా పశువులతో ప్రమాదాలు..

గూడెం కొత్తవీధి, మార్చి 27,ప్రభాతవార్త



గూడెంకొత్తవీధి మండలంలో పశువులను రోడ్లపై వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల రొంపుల గ్రామంలో జాతీయ రహదారిపైకి పశువులు రావడంతో ఆ మార్గంలో వస్తున్న వాహనాలు వాటిని ఢీకొని మూడు పశువులు మృతి చెందడంతో పాటు ఆవాహన చోదకులకు తీవ్ర గాయాలయ్యాయి. చింతపల్లి మండలంలో పశువులను తప్పించబోయి వాహనదారులు ప్రమాదానికి గురై గాయాల పాలయ్యారు. ఇలా రోడ్లపై పశువులు మూగజీవాలు రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనలపై అప్రమత్తమైన జీకేవీధి పోలీసులు పశువులను రోడ్లమీద వదిలేస్తే వాటి యజమానుల మీద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు పశువుల యజమానులకు అవగాహన కూడా కల్పించారు. అయితే యజమానుల్లో మార్పు రాలేదు. పశువులను వదిలేయడంతో అవి రోడ్డు మీదకు రావడం గుంపులుగా తిరగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్న పశువుల యజమానులు వాటిని బేఖాతర్ చేస్తున్నారు. దీంతో పశువులు రోడ్లమీదకి రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. పెదవలస చింతపల్లి జాతీయ రహదారి తో పాటు, రింతాడ జీకే వీధి ప్రధాన రాయలపై ఈ పశువులు సంచారం అధికంగా ఉంటోంది. ప్రమాదాలను నివారించేందుకు అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## అగ్నిబాధిత కుటుంబానికి 'దుమంతి' ఆర్థిక సాయం

కొయ్యూరు మార్చి 27 ప్రభాతవార్త



మండలంలోని చీడిపాలెం పంచాయతీ సింగవరం గ్రామ అగ్ని బాధిత కుటుంబం పాముారాజు కుటుంబానికి శుక్రవారం కొయ్యూరుకు చెందిన దుమంతి సత్యనారాయణ ఆర్థిక సాయం అందించారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఈ కుటుంబం సర్వం కోల్పోయిన విషయం తెలిసిందే. దీనితో స్పందించిన దాత దుమంతి సత్యనారాయణ బాధిత కుటుంబానికి రూ 5వేలు ఆర్థికసాయం చేసారు. ఈ కార్యక్రమంలో దుమంతి రామక్రిష్ణ, వినోద్, గడుతూరి శివ లు పాల్గొన్నారు.

## ఎన్.అర్.ఈ.జి.ఎస్ నిధులతో వీరవరం గ్రావెల్ రోడ్డు శంకుస్థాపన

గూడెం కొత్తవీధి మార్చి 27, ప్రభాతవార



జీకే వీధి మండలం వీరవరం గ్రామానికి సుమారు రెండు కోట్ల పది లక్షలు రూపాయలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జీకే వీధి సర్పంచ్ కోర్ర సుభద్ర ,ఎంపీపీ బోయిన కుమారి. ఎం.జీ.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. నిధులతో ప్రారంభించనున్న ఈ గ్రావెల్ రోడ్డు గ్రామస్థులకు వెసులుబాటుగా కానుంది. ఈ కార్యక్రమంలో బాగంగా ఎంపీటీసీ రాజేశ్వరి, ఎంపిటిసి నాగమణి, కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొండలరావు, బిజెపి మండల అధ్యక్షులు కాకూరి శేఖర్, వైసిపి మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, బిజెపి నాయకులు రాం కిరణ్, వైసిపి నాయకులు బోయిన వెంకట్ కృప, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## వైభవంగా రాములోరి కల్యాణం



గూడెం కొత్తవీధి, మార్చి 27, ప్రభాతవార్త

వేద సంకల్ప సేవా ట్రస్టు మరియు దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా జీ.కే వీధి మండలం చాపరాతిపాలెంలో రామాలయం ప్రాంగణంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.పరిసర ప్రాంతాల్లోని ప్రజలు,రామ భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.వేద సంకల్ప సేవా ట్రస్టు మరియు దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్‌ఆధ్వర్యంలో అందించిన రూ.10 వేల ఆర్థిక సహాయంతో శ్రీ రాములవారికి నూతన పట్టువస్త్రాలు, పూజా కార్యక్రమాలతో పాటు దంపతులకు నూతన వస్త్రాలు,భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 63 పైగా దేవస్థానాలకు శ్రీరామనవమి వేడుకలకు ఆర్థిక సహాయం అందించిన వేద సంకల్ప సేవా ట్రస్టు మరియు దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్‌కు భక్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు, యువత పాల్గొన్నారు. వేదమంత్రాలతో కళ్యాణం జరిగింది.

## నవమి నవమి కళ్యాణ మహోత్సవం..

గొలుగొండ మార్చి 28, ప్రభాతవార్త



శ్రీరామ నవమి కళ్యాణ మహోత్సవం గ్రామ గ్రామాన కనుల పండుగగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఉన్న రామాలయాలు వద్ద పండగ వాతావరణంలో మా రాములోరి పెళ్లి కుటుంబ సమేతంగా తరలిరావాలంటూ పక్క గ్రామాలకు ఆహ్వానాలు పలికి కళ్యాణ వైభోగంగా జరిపించారు. మండలంలో ఉన్న 27 గ్రామపంచాయతీలో అనుబంధ గ్రామాలతో కలిపి గ్రామ గ్రామాన రాముల వారి కళ్యాణం అంగరంగ వైభవంగా కళ్యాణ జంటలు కళ్యాణం నిర్వహించారు. ప్రతి గ్రామంలో కళ్యాణ మహోత్సవంతోపాటు భక్తులందరికీ పానకం చలివిడి వడపప్పు ప్రత్యేకంగా అందించారు. అలాగే ఆయా గ్రామాల పరిధిలో భారీ అన్న సమారాధనలు కూడా నిర్వహించారు. వాళ్ళు సంస్కృతిక కార్యక్రమాలు భజనలు, కోలాటాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో వసంతకాలు కూడా జల్లుకున్నారు. పాత కృష్ణా దేవిపేటలో సర్పంచ్ పందిరి సత్యం నాయుడు,ఏ ఎల్ పురంలో సర్పంచ్ లోచల సుజాత, నాగాపురంలో బొప్పన ప్రసాద్ దంపతులు, కొత్త మల్లంపేట, చోద్యం, గొలుగొండ, చీడిగుమ్మల, ఏటి గైరంపేట రావణా పల్లి, కొత్త ఎల్లవరం, పాకలపాడు, పుత్తడిగైరంపేట, నర్సింగపల్లి, జోగంపేట తోపాటు అన్ని గ్రామాల్లో కళ్యాణ వైభోగం కన్నుల పండుగగా సాగింది. ఆయా గ్రామాల పెద్దలు ప్రజలు మహిళలు కుటుంబ సమేతంగా పాల్గొని కళ్యాణం తిలకించారు. జానకిరాంపురం కోదండ రామస్వామి ఆలయం నుండి నరసింగపల్లి రామాలయానికి పానకం కావిడి పట్టు వస్త్రాలు రాములవారికి సమర్పించారు. గ్రామ పెద్దలంతా కుటుంబ సమేతంగా తరలివెల్లి కానుక సమర్పించి స్వామివారి కళ్యాణంలో పాల్గొన్నారు.

